

అనుదినం జనస్వరం
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక



1
వరంగల్ హనుమకొండ
జయశంకర్ భూపాలపల్లి జనగామ, మహబూబాబాద్ ములుగు
మంగళవారం 10.01.2023



# సమన్వయం కుదిరేనా ?

సీఎం పర్యటనలో నలుగురి పొత్తులో....

- తలోదారి... బీఆర్ఎస్ శ్రేణుల్లో అయోమయం..
- 12న మానుకోటకు సీఎం

**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి /మహబూబాబాద్**

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్ పట్టణానికి ఈనెల 12న సీఎం కేసీఆర్ రానున్నారు. జిల్లా బిఆర్ఎస్‌లో మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపి కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌లది తలోదారి కావడంతో సీఎం పర్యటన ఎలా జరుగుతుందోనన్న ఆందోళన సగటు బిఆర్ఎస్ శ్రేణుల్లో వుంది. మహబూబాబాద్ జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయాల సముదాయంతోపాటు మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, బిఆర్ఎస్ జిల్లా కార్యాలయం, గ్రంధాలయం, డబుల్ బెడ్రూం ఇండ్లను సీఎం ప్రారంభించాల్సి వుంది. జిల్లా బీఆర్ఎస్‌లో ప్రజాప్రతినిధుల మధ్య సయోధ్య కరువవడంతో సీఎం ఎన్ని ప్రారంభిస్తారన్నది సందేహాస్పదంగా మారింది. బహిరంగసభ కూడా వుంటుందా ? లేదా ? అన్న అనుమానాలు సైతం వున్నాయి. జిల్లా బిఆర్ఎస్‌లో పరిస్థితులను చక్కదిద్దడానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును రంగంలోకి దించే అవకాశం లేకపోలేదు.

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల 12న సీఎం కేసీఆర్ పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభిస్తారు. జిల్లా బిఆర్ఎస్‌లో ప్రజాప్రతినిధుల మధ్య వున్న విభేదాలతో పలు సందర్భాల్లో సీఎం జిల్లా పర్యటన వాయిదా పడుతూ వచ్చింది. జిల్లాకు చెందిన గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ల మధ్య సయోధ్య లేదు. వీరి మధ్య విభేధాలతో బిఆర్ఎస్ శ్రేణుల్లో సైతం గందరగోళం నెలకొంది. పార్టీలో ఎవరి వర్గం వారిదే కావడంతో మంత్రి సత్యవతికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీరందరినీ సమన్వయంతో నడపడం కత్తి మీద సాములా మారింది. ఈ క్రమంలో పలు సందర్భాల్లో సీఎం పర్యటనకు ఏర్పాట్లు చేసినా, ఆయన జిల్లా పర్యటనకు రాలేదు. ఈనెల 12వ తేదీన సీఎం పర్యటన ఖరారవడంతో ప్రజాప్రతినిధులు ఏర్పాట్లలో తలమునుకలయ్యారు.

**సయోధ్యకు ప్రయత్నం..**

సీఎం కేసీఆర్ పర్యటన నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం సాయంత్రం మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విభేధాలను పక్కనపెట్టి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని మంత్రులు ప్రజాప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు ఉద్బోధించారు. ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రులు ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేతోపాటు పార్టీ నేతలకు హితవు పలికారు.

**బహిరంగసభ నిర్వహణపై సందేహాలు..?**



మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో సీఎం పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించాల్సి వుంది. ప్రస్తుతం కలెక్టరేట్ భవన సముదాయాన్ని మాత్రమే ప్రారంభించనున్నట్లు తెలుస్తుంది. మిగతా కార్యక్రమాలను ఖరారు చేయాల్సి వుంది. ఇదిలావుంటే ఇక్కడ బహిరంగసభను ఏర్పాటు చేసే విషయంలో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తొలుత మహబూబాబాద్ జిల్లా పర్యటన ముగించుకొని సీఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ పర్యటించాల్సి వుంది. దీంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బహిరంగసభ పెట్టే అవకాశం లేదని ప్రచారం జరుగుతుంది. జిల్లాలో పోడు సమస్య అధికంగా వుండడం, ఇప్పటికీ సీఎం హామిని నిలబెట్టుకోకపోవడంతో బహిరంగసభను ఇక్కడ నిర్వహించక పోవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో 1.20 లక్షల ఎకరాల అటవీ భూములుండగా, 34 వేల మంది రైతులు 60 వేల ఎకరాల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని దరఖాస్తులు చేసుకున్నారు. ఇప్పటికీ ఈ సమస్యను పరిష్కరించకపోవడంతో బహిరంగసభను నిర్వహించకపోవచ్చన్న ప్రచారముంది. భద్రాద్రి కొత్తగూడెంలోనే బహిరంగసభను నిర్వహిస్తారన్న ప్రచారం కూడా జరుగుతుంది.

**ప్రారంభోత్సవాలపై సందేహాలు..**

బిఆర్ఎస్ జిల్లా కార్యాలయంతోపాటు, నూతనంగా మెడికల్ కాలేజీ తరగతులు కూడా ప్రారంభమయ్యాయి. ఈ రెండింటిని కూడా ప్రారంభించాల్సి వుంది. బిఆర్ఎస్ కార్యాలయాన్ని ప్రారంభించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మెడికల్ కాలేజీ తరగతుల ప్రారంభంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం కేసీఆర్ మహబూబాబాద్‌లో బహిరంగసభలో ప్రసంగిస్తారా ? లేదా ? అన్న విషయంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నూతన కలెక్టరేట్ ప్రాంగణంలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలను రూ.62 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించారు. ఈ భవనం ప్రారంభోత్సం సీఎం చేతుల మీదుగా జరగనుందని ఇప్పటికే ఖరారైంది. మిగతా అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు నేటికీ ఖరారు కాకపోవడం అనుమానాలకు తావిస్తుంది. పట్టణంలో రూ.5 కోట్ల అంచనా వ్యయంతో కొత్త గ్రంధాలయాన్ని నిర్మించారు. బిఆర్ఎస్ జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి ఎదురుచూస్తుంది. రూ.530 కోట్ల అంచనా వ్యయంతో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, హాస్టల్స్‌ను నిర్మించాల్సి వుంది. ఇందులో కేవలం నర్సింగ్ కాలేజీ నిర్మాణం మాత్రమే పూర్తయ్యింది. ప్రస్తుతం మెడికల్ కాలేజీ భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో నర్సింగ్ కాలేజీలోనే మెడిసిన్ విద్యార్థుల మొదటి బ్యాచ్‌కు తాత్కాలికంగా తరగతునులను నిర్వహిస్తున్నారు. మెడికల్ కాలేజీకి వెళ్లడానికి ఆర్ అండ్ బి రోడ్డు నుండి కాలేజీ వెళ్లడానికి రోడ్డును సైతం నిర్మించలేదు. సగం వరకే సిసి రోడ్డు నిర్మించి వదిలేశారు. దీంతో దీని ప్రారంభోత్సవం వుంటుందా ? లేదా ? అన్న అనుమానాలున్నాయి. పట్టణంలోని వేల్పుల సత్యంనగర్‌లో నిర్మించిన 180 డబుల్ బెడ్రూం ఇండ్లను ప్రారంభించాల్సి వుంది. ఈ అభివృద్ధి కార్యక్రామాల్లో ఎన్ని ప్రారంభిస్తారనే విషయంలో చివరి వరకు ఉత్కంఠ తప్పకపోవచ్చు.





నూతన కలెక్టరేట్ భవనం



నర్సింగ్ కళాశాల



కళా తోరణం



## శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలకు సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే ఆహ్వానం

**నవతెలంగాణ - ఐనవోలు**

ఈ నెల 13 నుండి జరగనున్న ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల జాతర ఆహ్వాన పత్రికను సోమవారం హైదరాబాద్ ప్రగతి భవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు మర్యాదపూర్వకంగా కలిసి అందజేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ని ఐనవోలు జాతరకు హాజరు కావాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు సీఎం కేసీఆర్‌కు వేద మంత్రాలతో ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక దృష్టితో నిధులు కేటాయించాలని సీఎం కేసీఆర్‌ఏ వినతిపత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర రావు,ఆలయ మాజీ చైర్మన్ మునిగాల సమ్మయ్య,ప్రధాన అర్చకులు రవీందర్, విక్రంత్ జోషి, మధుకర్ శర్మ,పురుషోత్తమ శర్మ పాల్గొన్నారు.



## ఈనెల 13న సదరన్ క్యాంపు : డీఎంహెచ్ఓ

**నవతెలంగాణ- ములుగు**

తాత్కాలికంగా ఈ నెలలో 13న సదరన్ క్యాంప్ నిర్వహించడం జరుగుతుందని డీఎంహెచ్ఓ అప్పయ్య తెలిపారు. సోమవారం ములుగు జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య ఆదేశాలతో సోమవారం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్ అధ్యక్షతన సదరం క్యాంపు నిర్వహించుటకు కన్సల్టెన్సీ సమావేశం నిర్వహించారు. కొత్తగా కంటి వైకల్యం 15 ,మానసిక వైకల్యం 15, రెన్యూవల్ పరీక్షలు నిర్వహించారు. సదరు లబ్దిదారులు రేపటి నుండి సమీప మీసేవ కేంద్రంలో స్లాట్ నమోదు చేసుకోవాలని కోరారు. మళ్ళీ పండుగ తర్వాత వారంలో ఒక దఫా, రెండు దఫాలుగా సంవత్సరం మొత్తం నిర్వహించేటట్లు ప్రణాళిక రూపొందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డిఓ నాగ పద్మజ, డీపీఎం గోవింద్ చవాన్, ఏపీఎం రవి, ఎస్ఐ ఓంకార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ ఎస్ క్రిష్ణ ఆదిత్య**

**నవతెలంగాణ-ములుగు**

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ యస్ క్రిష్ణ ఆదిత్య ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వైవి గణేష్‌తో కలసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 38 ధరఖాస్తులను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలతో జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాదాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రజావాణి దరఖాస్తులను పెండింగ్ ఉంచకుండా పరిష్కరించాలని, తిరస్కరించిన పక్షంలో అందుకు గల కారణాలను తెలుపుతూ అర్జిదారునికి అందజేయాలని సూచించారు. మన ఊరు మనబడి మొదటి విడత కార్యక్రమంలో ఎంపికైన పాఠశాలలో మిగిలి ఉన్న పెయింటింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులు అందరూ స్కాలర్ షిప్ కోసం ఆన్లైన్లో అప్లై చేసుకునేలా ప్రధానోపాధ్యాలు విద్యార్థులకు అవగాహన కల్పించాలని అన్నారు. జనవరి 18 నుండి ప్రారంభించనున్న రెండవ కంటి వెలుగు కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో వ్యవహరించి విజయవంతం చేసేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. డీఆర్వో రమాదేవి, జెడ్పీ సీఈవో ప్రసున్నారాణి, డీఆర్డీఓ నాగ పద్మజ, డీటీడీఓ దేశ్ రామ్, డీఎంహెచ్ఓ అల్లం అప్పయ్య, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఎం ప్రకాష్, టీసీ డెవలప్మెంట్ అధికారి లక్ష్మణ్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేష్, ఎస్సీ డెవలప్మెంట్ అధికారి, పి భాగ్యలక్ష్మి ఎస్సీ కార్పొరేషన్ అధికారి తుల రవి, డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై అధికారి, అరవింద్‌రెడ్డి, డిస్ట్రిక్ ఇరిగేషన్ అధికారి కె బాబురావు, డిస్ట్రిక్ యూత్ స్పోర్ట్స్ అధికారి వెంకటరమణాచారి, డీఐఏఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



### సాంస్కతిక కార్యక్రమాల్లోనూ రాణించాలి

**నవతెలంగాణ-ములుగు**

యువత చదువుతోపాటు సాంస్కతిక కార్యక్రమాల్లో రాణించాలని జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్య అన్నారు. ఈనెల 4న స్థానిక డిఎల్ఆర్ గార్డెన్స్ లో జిల్లా యువజన ఉత్సవాలు నిర్వహించి ఫస్ట్ ప్రైజ్ విన్నర్స్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్ణయించారు. ఈనెల 10 న హైదరాబాద్‌లోని శిల్పారామంలో రాష్ట్ర యువజన ఉత్సవాలు -2023 జిల్లా ఏర్పడిన తర్వాత మొదటిసారిగా పాల్గొనుటకు వెళ్తున్న ఫోక్ డాన్స్, ఫోక్సాంగ్స్, ఉపన్యాస విజేతలను జిల్లా కలెక్టర్ అభినందించారు. యువత ఆరోగ్యం కాపాడుకుంటూ, క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఇలాంటి యూత్ ఫెస్టివల్స్ లో పాల్గొనడం వల్ల విభిన్న సాంస్కృతిక, స్కిల్స్, మేధో సంపదను పెంపొందించుకోవచ్చన్నారు. సిబ్బంది, తల్లిదండ్రుల కోరిక మేరకు బస్సు వేసేందుకు అనుమతించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నవ్య, వర్షిని, దీపిక, పల్లవి, హాని ,సమీరా, కష్ణవేణి ,సాయి ప్రియ, హబీబుద్దీన్, అడిషనల్ కలెక్టర్ గణేష్, ఆర్డీవో రమాదేవి, జూనియర్ కాలేజ్ లెక్చరర్ కేర్ టేకర్ ఎండీ రఫీ, పివిఆర్ చారి మొదలవారు పాల్గొన్నారు.

### 'విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి'

**నవతెలంగాణ-ములుగు**



ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వరంలో అడిషనల్ కలెక్టర్ వైవి గణేష్ కు సోమవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రత్నం ప్రవీణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టిఎల్ రవి మాట్లాడుతూ ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బయోమెట్రిక్ విధానం లేక సమయానికి విద్యాబోధన అందకపోవడంతో పేద, మధ్యతరగతి విద్యార్థులకు మెరుగైన విద్య అందడం లేదని అన్నారు. లెక్చరర్స్ కళాశాల మీద దష్టి పెట్టక పోవడంతో విద్యార్థుల అడ్మిషన్ ప్రక్రియ, విద్యార్థుల హాజరుశాతం దినదినం తగ్గిపోతున్నదన్నారు. ఇలాగే నిర్లక్ష్యం కొనసాగితే మరింతమంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంటుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది సమయపాలనతోపాటు విద్యార్థుల పై దృష్టి పెట్టాలని కోరారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుంటే దశల వారి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గుగులోత్ రమేష్, సాదు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి సందర్భంగా 800 ఆర్టీసి సర్వీసులు

- టోల్ వద్ద ప్రత్యేక వే..

**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఆర్టీసి అధికారులు 800 స్పెషల్ సర్వీసులను నడుపనున్నారు. ఇందుకు ఆర్టీసి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈనెల 9వ తేదీ నుండి 13వ తేదీ వరకు రోజుకు 70 బస్సులను అదనంగా నడిపిస్తున్నారు. మొత్తంగా 350 నుండి 400 సర్వీసులను నడుపనున్నారు. 14వ తేదీన డిమాండ్ వుంటే ఆ రోజు కూడా బస్సులు అదనంగా నడిపించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. అదే విధంగా పండుగకు వెళ్లిన వారి తిరుగు ప్రయాణం సౌకర్యార్థం ఈనెల 16వ తేదీ నుండి 19వ తేదీ వరకు అదనపు ఆర్టీసి బస్సులను నడుపనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. అంతేకాకుండా ఆన్‌లైన్ రిజర్వేషన్‌లో డిమాండ్‌కనుగుణంగా అదనపు బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. సంక్రాంతి పర్వదినం సందర్భంగా పాఠశాలలకు సెలవులు ప్రకటించిన దరిమిలా స్కూల్స్ విద్యార్థుల సౌకర్యార్థం నడిపే బస్సులను ఈ పండుగ సందర్భంగా వినియోగించనున్నారు.



**రోజుకు 70-80 సర్వీసులు**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9 ఆర్టీసి డిపోలున్నాయి. ఒక్కో డిపో నుండి సంక్రాంతి పండుగ సందర్భంగా 10 సర్వీసులను అదనంగా నడిపిస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రోజుకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో 70 నుండి 80 అదనపు సర్వీసులను నడుపుతాము. డిమాండ్‌ను బట్టి ఈ సర్వీసులను పెంచే అవకాశం కూడా వుంది. సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజల సౌకర్యార్థం ప్రయాణంలో ఆలస్యాన్ని నివారించడానికి టోల్ గేట్ వద్ద (కోమల్ల) హన్మకొండ నుండి హైద్రాబాద్‌కు వెళ్లే దారిలో 7వ లేన్, హైద్రాబాద్ నుండి హన్మకొండకు వచ్చే సందర్భంగా 6వ లేన్‌ను ఆర్టీసి బస్సుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. ప్రతి డిపో నుండి 10 అదనపు సర్వీసులను నడపడానికి ఏర్పాట్లు చేశాం.

- జె శ్రీలత,ఆర్టీసీ ఆర్ఎం

# కోడిపుంజుల అంగడి భూమి కేటాయించాలి

- ములుగు ఎమ్మెల్యే సీతక్క

**నవతెలంగాణ - ములుగు**

గోదావరి ముంపు నిర్వాసితులకు కోడిపుంజుల అంగడి భూమి కేటాయించాలని ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ కృష్ణ ఆదిత్యను కలిసి పలు సమస్యలు వివరించి లేఖ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏటూరునాగారం గోదావరినది తీర సమీప ప్రాంతంలో ఉన్న అణగారిన కులాలకు చెందిన నిరుపేదలు జీవనోపాధి కోసం వ్యవసాయం చేస్తూ కొనసాగించుకుంటున్నారు. గోదావరి ఉగ్రరూపం దాల్చినప్పుడల్లా ముంపు ప్రాంతంలో ఉండే ప్రజలు ప్రాణాలను అరిచేతిలో పెట్టుకొని బ్రతుకుతున్నారని అన్నారు. ముంపు ప్రాంత ప్రజల స్థిర నివాసం కొరకు ఏటూరునాగారం మానసపల్లి శివారులో ఉన్న కోడిపుంజుల అంగడి ప్రభుత్వ భూమిని ముంపు బాధితులకు ఇళ్ళ స్థలాలను కేటాయించాల న్నారు. కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరునాగారం మండలాలలో వరదలకు నీట మునిగిన గుర్తించి ప్రభుత్వానికి చెందిన సురక్షితమైన స్థానంలో ఇళ్ళ స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వాలని కోరారు. బాధిత గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



**సీసీ రోడ్డు పనులు, అంగన్‌వాడీ భవనం ప్రారంభం**

మండలంలోని అబ్బాపూర్ గ్రామంలోని శ్రీరాముల పల్లి సీతక్క కాలనీ లో రూ.4.99 లక్షలతో సీసీ రోడ్డు, అంగన్ వాడీ బిల్డింగ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సీతక్క సోమవారం సర్పంచ్ గండి కల్పనా కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం అబ్బాపూర్ జిల్లా ప్రజా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులు చదువుకోవాలనీ, పాఠశాల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తానని అన్నారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్ల పెల్లి రాజేందర్ గౌడ్, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షులు ఆకు తోట చంద్ర మౌళి, సర్పంచ్ గండి కల్పనకుమార్, మాజీ సర్పంచ్ ఆనందం, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రచార కార్యదర్శి నునేటి శ్యామ్, గ్రామ కమిటీ అధ్యక్షులు గుండ భిక్షపతి, మొడెం మొగిలి, తదితరులు పాల్గొన్నారు.



# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో బీఆర్ఎస్ నిర్లక్ష్యం

- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అర్హులందరికీ ఇండ్లు..
- భూపాలపల్లిలో ఒక్కరోజు నిరసన దీక్షలో గండ్ర సత్యనారాయణరావు



**నవతెలంగాణ-భూపాలపల్లి**

జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ నిర్మాణంతోపాటు పంపిణీ చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, హామీల అమలులో విఫలమైందని టీపీసీసీ సభ్యులు, భూపాలపల్లి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. కొత్తగా ఇండ్లు నిర్మించుకోవాలంటే రూ.3 లక్షలు సరిపోతాయా? ఆ డబ్బులు మేస్త్రీ కూళ్లకు కూడా చాలవని అన్నారు. సోమవారం భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఇండ్లు లేని పేద, నిరుపేదలకు ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి పట్టణ, గ్రామీణ మండలాల అధ్యక్షులు ఇస్లావత్ దేవన్, సుంకరి రామచంద్రయ్య ఆధ్వర్యంలో ఒక్క రోజు నిరసన దీక్ష చేపట్టారు. గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పాలనలో పేదోడికి సొంతిళ్లు కూడా కట్టుకునే అదృష్టం లేకుండా పోయిందని ఎద్దేవా చేశారు. ఎన్నికల ముందు ఇళ్ల నిర్మాణం కొరకు రూ.5లక్షలు ఇస్తానని చెప్పి, ఇప్పుడు రూ.3లక్షలు మాత్రమే ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలోని ఒక్కో నియోజకవర్గంలో కేవలం మూడు వేల మందే అర్హులు ఉన్నారా అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలు అందరికి రూ.5లక్షలు వ్వాలని డిమాండ్ చేశారు. ఎనిమిదేళ్ళ పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేద, నిరుపేద ప్రజలను మోసం చేస్తూ వస్తున్నాయని మండిపడ్డారు. పేద ప్రజల పక్షాన ఎల్లప్పుడూ కాంగ్రెస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని అన్నారు.



రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వకుంటే రాబోయే రోజుల్లో భారీ ఎత్తున నిరసన ప్రదర్శనలు చేపడుతామని హెచ్చరించారు. దేశానికి దశాదిశ నిర్దేశించగల బలమైన నాయకుడు రాహుల్ గాంధీయేనని అన్నారు. కాంగ్రెస్ హయాంలో ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించి పేదలకు ఇచ్చిందని, ఈ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ళ పేరిట నిర్మాణాలు చేపట్టినా నిర్మాణాలు పూర్తి చేసి పేదలకు ఇవ్వలేదని అన్నారు.

**ఆకట్టుకున్న బహుజన కళా మండలి పాటలు..**

ఈ నిరసన దీక్షలో సురేష్ కు చెందిన బహుజన కళా మండలి బృందం పాడిన పాటలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ప్రభుత్వాల అన్యాయాలు, అక్రమాలను పాటల ద్వారా అవగాహన కల్పించారు. టీపీసీసీ సభ్యులు చల్లూరి మధు, పట్టణ 16వ వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్, భూపాలపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వెంపటి భువనసుందర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు పోరిక సమ్మయ్య నాయక్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు బట్టు కరుణాకర్, ఐఎన్‌టీయూసీ నాయకులు జోగు బుచ్చయ్య బుర్ర కొమురయ్య, జిల్లా నాయకులు దూడపాక శంకర్, పిప్పాల రాజేందర్, తోట సంతోష్, అంబాల శ్రీనివాస్, రామినేని రవీందర్, గణపురం మండల వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, నగునూరి రజినీకాంత్, తోట రంజిత్, ఎస్కెసాగర్, పొనగంటి శ్రీనివాస్, బౌతు రాజేశ్, కంచర్ల సదానందం, సీనియర్ నాయకులు, గ్రామ కమిటీల అధ్యక్షులు, నాయకులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



## మినీ మేడారం విజయవంతం చేయాలి

- సందర్శకులకు ఇబ్బందులు కలుగకుండా సకల సౌకర్యాలు
- ఏటూర్ నాగారం ఐటీడీఏ పీఓ అంకిత్

**నవతెలంగాణ -తాడ్వాయి**

వచ్చే ఏడాది ఫిబ్రవరిలో 1వ తేది నుంచి 4వ తేది వరకు జరిగే మినీ మేడారం జాతరను విజయవంతం చేయాలని ఏటూరు నాగారం ఐటీడీఏ పీవో అంకిత్ అన్నారు. సోమవారం మేడారంలోని ఐటీడీఏ గెస్ట్ హౌస్‌లో ఈవో రాజేంద్రం ఆధ్వర్యంలో మేడారం పూజారులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంకిత్ మాట్లాడుతూ మేడారం సమ్మక్క-సారలమ్మ మినీ జాతరకు అభివృద్ధి పనులు ప్రారంభించి పూర్తిచేయాలని సూచించారు. జాతరలో సందర్శకులకు ఇబ్బందులు కలుగకుండా తాగునీరు, టాయిలెట్స్, షెడ్స్, విద్యుత్తు, రవాణా, శానిటేషన్, బ్యాటరీ ఆఫ్ టాప్స్, జంపన్న వాగులో స్త్రీలకు బట్టలు మార్చుకుని గదులు సకల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. గుడుంబా తయారీ కోసం అమ్మవారికి సమర్పించిన బెల్లాన్ని ఉపయోగించొద్దని, ఇందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో గత జాతర కంటే మెరుగైన సౌకర్యాలు అందించాలని కోరారు. అనంతరం అధికారులతో కలిసి జంపన్న వాగు వద్ద వెళ్లి బ్యాటరీ ఆఫ్ టాప్స్ లు పరిశీలించారు. మేడారం బస్టాండ్ ఏరియా, పగడిద్దిరాజు, గోవిందరాజు భవనాలను రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాలను పరిశీలించారు. మొదట సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వనదేవతలను అధికారులతో కలిసి దర్శించుకున్నారు. పూజార్లు ఎండోమెంట్ సిబ్బంది ఆలయ సాంప్రదాయాల ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. సమ్మక్క- సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు వనదేవతలకు పసుపు, కుంకుమ, చీర, సారే సమర్పించి మొక్కులు చెల్లించారు. ఏపీవో వసంతరావు, పూజార్ల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఈఓ రాజేంద్రం, డీఎంహెచ్ఓ అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ కోరం క్రాంతికుమార్, విద్యుత్‌శాఖ డీఈ పుల్సం నాగేశ్వర రావు, ఏఈ వేణుకుమార్, ఆర్అండ్‌బి డీఈ రఘువీర్, ఐబీ డీఈ ఎగ్గడి సదయ్య, ఎక్సైజ్ శాఖ సీఐ సుధీర్ కుమార్, ఆర్టీసీ కంట్రోలర్ శంకర్ సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజు పూజారులు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రజా సమస్యల పరిష్కారానికి పత్రికలు తోడ్పడాలి

- భూపాలపల్లి తహసిల్దార్ ఎండి ఇక్బాల్

**నవతెలంగాణ-భూపాలపల్లి**

ప్రజా సమస్యల పరిష్కారానికి పత్రికలు తోడ్పడాలని భూపాలపల్లి తహసీల్దార్ ఎండీ ఇక్బాల్ అన్నారు. సోమవారం భూపాలపల్లి మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో నవతెలంగాణ-2023 నూతన క్యాలెండర్ ను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను వెలికి తీసి ప్రజలకు ప్రభుత్వానికి అధికారులకు వారధిగా నిలవాలన్నారు. ప్రజా సమస్యలను వెలికితీస్తూ ప్రజలకు న్యాయం జరిగేలా నవతెలంగాణ దినపత్రిక ముందుకు సాగడం అభినందనీయమని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతూ ప్రజల మన్ననలు పొందుతున్న నవ తెలంగాణను ఆదరించాలని కోరారు. సమస్యలు అధికారుల దృష్టికి తీసుకొచ్చి ప్రజల సమస్యలను పరిష్కరించడంలో నవతెలంగాణ ముందు వరుసలో ఉంటుందని కొనియాడారు. కొత్త సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని, నవతెలంగాణ పత్రిక మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విలేకరులకు మండల ప్రజలకు అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవ తెలంగాణ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ ఎర్రం సతీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రదీప్ కుమార్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ అజారుద్దీన్, జూనియర్ అసిస్టెంట్ సిహెచ్ రాజ్యలక్ష్మి, జెపి ఆన్లైన్ నిర్వాహకులు మంద జీవర్ధన్, వన్ వాయిస్ యూత్ అధ్యక్షుడు బొమ్మ రమేష్, రెవెన్యూ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక









## సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నవతెలంగాణ-భూపాలపల్లి**

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఇల్లందు క్లబ్ హౌస్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజల సమస్యలకు సంబంధించిన 15 దరఖాస్తులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ప్రజల నుండి అందిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖలకు సూచించారు. పెండింగ్ సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఆశాలత, డీఆర్డీఏ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగ హక్కును కాలరాయడమే

- వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి పొలం రాజేందర్

**నవతెలంగాణ -మహాముత్తారం**

దేశంలో సబ్సిడీ బియ్యాన్ని రద్దు చేయడం రాజ్యాంగ హక్కును కాలరాయడమేనని వ్యవసాయ కార్మిక సంఘం(వ్యకాస) జిల్లా ప్రధాన కార్యదర్శి పొలం చిన్న రాజేందర్ అన్నారు. సోమవారం స్థానిక తాసిల్దార్ మాధవికి వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడారు. డబ్ల్యూటీఓ, ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు షరతులను మోడీ ప్రభుత్వం యథావిధిగా అమలు చేస్తున్నదని దుయ్యబెట్టారు. పేదలకు అందించే సబ్సిడీల నుంచి తప్పుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధపడిందన్నారు. దీంతో కోట్లాదిమంది నిరుపేదల కుటుంబాలను ఆత్మహత్యల వైపు పురికొల్పే ప్రమాదం ఉందన్నారు. రేషన్ షాపు డీలర్లు ఉపాధి కోల్పోయి రోడ్డున పడతారని, రైతుల వరి ధాన్యాన్ని సేకరించే బాధ్యత ఎఫ్‌సిఐ గోడౌన్ల నిర్వహణా బాధ్యతల నుండి తప్పుకునేందుకు, దేశంలో ఆహార సంక్షోభం నెలకొనే ప్రమాదం పొంచి ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యంతోపాటు సబ్సిడీ బియ్యాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కలిసివచ్చే వాళ్లందర్నీ కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచాలన్నారు. కేరళ వామపక్ష ప్రభుత్వం మాదిరిగా 14 రకాల నిత్యవసర సరుకులను రాష్ట్ర ప్రభుత్వం అందించడానికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న వాళ్లందరికీ కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని, పాత రేషన్ కార్డులలో పేర్ల మార్పులు చేర్పులు చేసుకునే అవకాశం నిరంతరం కొనసాగించాలని అన్నారు. ఎప్పుడైనా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. గూడెల్లి శ్రీకాంత్, చింతల రాజబాబు, తదితరులు పాల్గొన్నారు.

## షెడ్యూల్ విడుదల చేయాలి : పీఆర్‌టీయూ

**నవతెలంగాణ-చిట్యాల**



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ అన్నారు సోమవారం అధ్యక్షుడు పంచిక భగవాన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మండల సమావేశంలో కిరణ్‌కుమార్ హాజరై మండలశాఖ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈఓ కొడెపాక రఘుపతి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయేన మాట్లాడుతూ.... ప్రభుత్వ పాఠశాలల్లో 8 సంవత్సరాలుగా ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించలేదన్నారు. జిల్లా ,రాష్ట్రస్థాయి వరకు విషయ నిపుణుల కొరతతో ప్రభుత్వ పాఠశాలల్లో లక్ష్యాలను సాధిం చడంలో వెనుకబడుతున్నారన్నారు. పదోన్నతుల ద్వారా ఖాళీ అయిన ఉద్యో గాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుల కొరత ఉన్నందున తక్షణమే ప్రాథమిక పాఠ శాలలో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్లకు పదోన్నతులు కల్పిస్తూ పిఎస్ హెడ్మా స్టర్ల పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న గ్రేడ్-2 పండిట్‌లను, పీఈటీలను అప్‌గ్రేడేషన్ చేసి, పదోన్నతులు కల్పించాలని కోరారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రామ్ నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు మనోహర్ రావు, గోవిందు సత్యనారాయణ ,రాష్ట్రచ, జిల్లా కార్యవర్గ సభ్యులు రహీమ్ పాషా, విజయ సాగర్ ,వెల్దండి హనుమంతు, శ్రీకాంత్, సుజాత, తడక ప్రవీణ్, మండల బాధ్యులు శైలజ, సతీష్, రాజేంద్ర ప్రసాద్, మారం తిరుపతి రెడ్డి భుజేంద్ర చారి, తదితరులు పాల్గొన్నారు.

## చలో ప్రగతి భవన్‌ను అడ్డుకున్న పోలీసులు

- ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్ కుమార్

**నవతెలంగాణ-భూపాలపల్లి**



భూపాలపల్లి పట్టణంలోని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు చలో ప్రగతి భవన్ కార్యక్రమానికి వెళ్లే ప్రయత్నంలో సోమవారం తెల్లవారుజామున ముందస్తుగా భూపాలపల్లి ఎస్సై ప్రశాంత్ ఆధ్వర్యంలో అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోతుకు ప్రవీణ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వేముల శ్రీకాంత్ మాట్లాడుతూ ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. 1600/800 పరుగు పందెంలో ఉత్తీర్ణత సాధించిన ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులందరికి మెయిన్స్ పరీక్ష అవకాశం కల్పించాలన్నారు. ప్రిలిమ్స్ ప్రాథమిక మల్టీపుల్ పరీక్షలో తప్పుగా వచ్చిన 7 ప్రశ్నలకు మార్కులు కలపాలని కోరారు. హైకోర్ట్ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయని పోలిస్ రిక్రూట్మెంట్ బోర్డు చైర్మెన్ పై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రిలిమ్స్ పరీక్షలలో తప్పుగా వచ్చిన ప్రశ్నలన్నింటికీ మార్కులను కలపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ నాయకులు మెట్టు అనిల్ కిరణ్, నేరెళ్ల జోసెఫ్, జంపాల పవన్, తిరుపతి, రాజశేఖర్ అరెస్ట్ అయ్యారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-చిట్యాల:**



ప్రజాపిత బ్రహ్మకుమారి విశ్వవిద్యాలయం పరకాల శాఖ వారి నూతన సంవత్సర సందర్భంగా ప్రజల్లో ఆధ్యాత్మిక క్రాంతి అనే శాంతిని ప్రజల్లో తీసుకువచ్చేం దుకు సంస్థ పరిచయంతోపాటు నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో నిర్వాహకులు స్నేహ, రాజేందర్ రాజేశ్వరరావు ఆవిష్కరించి విద్యార్థులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక శాంతియుత భావాలు పెంపొందించేందుకు ప్రజాపిత బ్రహ్మకుమారి కృషి చేస్తుందని అన్నారు. ఉచితంగా ఆధ్యాత్మిక విలువలు బ్రహ్మకు మారి కోర్సు వివరాలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పరకాలశాఖ సెంటర్ బి కే రమేష్, నరేందర్ పాల్గొన్నారు. జూకల్ సాయిరెడ్డి, శంగారపు రంగాచారి, లక్ష్మారెడ్డి, హై స్కూల్ హెడ్మాస్టర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణి సిద్ధు

**నవతెలంగాణ-భూపాలపల్లి**



ఈనెల 13న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగే ముగ్గుల పోటీలను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వెంకటరాణిసిద్ధు, ఎంపీపీ మండల లావణ్య కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జీఎంఆర్ఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అధికారికంగా ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇదే క్రమంలో అతని తండ్రి గండ్ర మోహన్‌రెడ్డి స్మారకర్థం ఏర్పాటు చేసిన జిఎంఆర్ఎం ట్రస్ట్ ద్వారా ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అధ్యక్షతన జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో నియోజకవర్గస్థాయి ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పోటీల్లో 5రకాల ముగ్గులు వేయాలన్నారు. ఒక్కో విభాగానికి సంబంధించిన ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి రూ.5000 ,ద్వితీయ బహుమతి రూ.3000, తృతీయ బహుమతి రూ.2000 అందజేస్తామని తెలిపారు. ఐదు విభాగాల్లో నిర్వహిస్తున్న పోటీల్లో మొత్తం 15మంది విజేతలకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉత్సాహవంతులైన మహిళలు అధిక సంఖ్యలో హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మహిళా అధ్యక్షురాలు తిరుపతమ్మ, కౌన్సిలర్లు ,దార పులమ్మ ,పానుగంటి హారిక ,మేకల రజిత చల్లా రేణుక ,పిల్లలమర్రి శారద, కుర్మిళ్ల రజిత ,కో ఆప్షన్ మెంబెర్ కమల మరియు మహిళా నాయకురాళ్లు స్వాతి ,భాగ్య లక్ష్మి ,స్వప్న మరియు గ్రంధాలయ సంస్థ చైర్మెన్ బుర్ర రమేష్ గౌడ్ ,అర్బన్ పార్టీ అధ్యక్షులు కటకం జనార్దన్ మునిసిపల్ వైస్ చైర్మెన్ కొత్త హరిబాబు , పి ఎస్ సి ఎస్ చైర్మెన్ మేకల సంపత్ మైనారిటీ జిల్లా అధ్యక్షులు కరీమ్ , కౌన్సిలర్లు సజనాపు స్వామి, ముంజల రవీందర్,కో ఆప్షన్ ఇర్ఫాని, అర్బన్ నాయకులు సిద్దు , రమేష్, కుమారస్వామి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్‌యూటీఎఫ్ క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

**నవతెలంగాణ -తాడ్వాయి**



మండల కేంద్రంలోని మానవ వనరుల కేంద్రంలో ఎంఈఓ యాప సాంబయ్య ఆధ్వర్యంలో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్, డైరీని సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి యాప సాంబయ్య, టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు సుతారి పాపారావు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం పోరాటంలో యూటీఎఫ్ ముందుంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత శాతం పెరిగిందని ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయుల బోధన చేయడంతో మంచి ఫలితాలు వస్తున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్, ఉపాధ్యాయ నాయకులు అల్లం భాస్కర్, వంక నాగేశ్వరరావు, చంద్రారెడ్డి, రవీందర్ లక్ష్మయ్య మహిళా ఉపాధ్యాయులు రజిత వెంకట లక్ష్మి, ఎంఆర్‌సి సిబ్బంది నీలం బాబు, రవికుమార్, రమేష్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థులు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ బుర్ర రమేష్

**నవతెలంగాణ-భూపాలపల్లి**



పూర్వ విద్యార్థులు సమాజాభివద్ధిలో భాగస్వాములు కావాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బుర్ర రమేష్ పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగిన ప్రతిభ విద్యా మందిర్ కారల్ మార్క్స్ కాలనీ 2008- 2009 పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో బుర్ర రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పూర్వ విద్యార్థులు ప్రభుత్వ రంగంలో ఉద్యోగస్తులుగా అమెరికా లాంటి దేశాలలో ఉద్యోగాలు,వ్యాపారాలు చేస్తున్నారని తెలిపారు. 1996 లో స్థాపించినప్పుడే ఈ రోజుల్లో జరుగుతున్న గురుకుల విద్యా విధానాన్ని మన ప్రతిభ విద్యా మందిర్లో ప్రవేశ పెట్టినట్టు వివరించారు. అనేకమంది డాక్టర్లు ఇంజనీర్లు పారిశ్రామికవేత్తలుగా రాజకీయ రంగంలో కౌన్సిలర్‌గా రాజకీయంగా ఎదిగారని తెలిపారు. కొందరు వ్యాపారస్తులు పారిశ్రామిక వేత్తలుగా ఎదిగినందుకు గురువుగా తాను హర్షిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల యువజన అధికారిని బుర్ర సునీత, ఉపాధ్యాయులు కుసుమ కష్ణమోహన్, గుంటి పోచయ్య హనుమంత రావు ఉమారాణి, పుష్పలత, జ్యోతి రజనీకాంత్, శ్రీకాంత్ , ఊకె రమణ, కే సతీష్ పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా 'పూల నరేష్'

**నవతెలంగాణ-మంగపేట**



యువజన కాంగ్రెస్ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోడెల నరేష్ (పూల నరేష్)ను నియమిస్తూ ములుగు ఎమ్మెల్యే సీతక్క సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ రవి చందర్, ములుగు జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు గుమ్మడి సోమయ్య, మండల పార్టీ అధ్యక్షుడు మైల జయరాం రెడ్డిల సమక్షంలో నరేష్‌కు నియామక పత్రాన్ని సీతక్క అందజేశారు. మండలంలోని నర్సాపురం బోర్ గ్రామానికి చెందిన నరేష్ స్థానికంగా జ్వాలా యూత్ అసోసియేషన్, జ్వాలా ట్రస్టులకు వ్యవస్థాపక అధ్యక్షుడుగా పని చేస్తున్నాడు. మండల వ్యాప్తంగా సేవలందించడమే కాకుండా ఎమ్మెల్యే సీతక్క సామాజిక సేవా కార్యక్రమాలకు ముగ్ధుడై రెండేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాటి నుండి మండలంలో యూత్ కాంగ్రెస్, పార్టీ బలోపేతానికి కషి చేస్తూ ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుగా ఎదిగారు. ఈ క్రమంలో ఆయనకు యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ములుగు ఎమ్మెల్యే సీతక్క, గుమ్మడి సోమయ్య, మైల జయరాం రెడ్డి ఇతర మండల, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారంతో యూత్ కాంగ్రెస్ కార్యక్రమాలు జిల్లాలో చేపడతానన్నారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లెపల్లి శివప్రసాద్, బీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది నరసింహారావు, సింగిల్ విండో డైరెక్టర్ కోడం బాలకష్ణ, తూడి భగవాన్ రెడ్డి, అయ్యోరి యానయ్య, ఉజ్వల్, కురుసం రమేష్ చెట్టుపల్లి ముకుందంలు పాల్గొన్నారు.

## కత్తిగూడెం సాగుదారులకు పట్టాలివ్వాలి : సీపీఐ(ఎం)

**నవతెలంగాణ-మంగపేట**



మండలంలోని కత్తిగూడెం రెవెన్యూ శివారు సర్వే నెంబర్ 128లో కాస్తులో ఉన్న పేద రైతుల సర్వే నిర్వహించి వారికి ప్రభుత్వం పట్టాలివ్వాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి జాగటి చిన్న డిమాండ్ చేశారు. సోమవారం కత్తిగూడెం గ్రామంలో సాగుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 30 సంవత్సరాలుగా గ్రామానికి చెందిన పేద రైతులు భూములను సాగుచేస్తుంటే రెవెన్యూ అధికారులు పట్టాలివ్వకపోవడం శోచనీయమన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంవత్సరాల తరబడి ధర్నాలు నిర్వహించి జిల్లా కలెక్టర్ లకు తహసీల్దార్‌లకు వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేదన్నారు. 2017లో అప్పటి సబ్ కలెక్టర్ వీపీ.గౌతమ్ కోయ భాస్కర్ రావు, కోయ బోసుబాబు పట్టాలు రద్దు చేసి కత్తిగూడెం సాగు రైతులకు పట్టాలివ్వాలని ఆదేశాలిచ్చారన్నారు. నేటికి ఐదు సంవత్సరాలుగా రైతులకు న్యాయం జరగలేదన్నారు. రెవెన్యూ అధికారులు ఆ భూములను సర్వే చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు కేసీఆర్ రాష్ట్రాన్ని బంగారు తెలంగాణ చేస్తానని దళితులకు 3 ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇస్తానని చేసిన హామీలు అమలు కాలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా మండలంలో జరిగే రెవిన్యూ సదస్సుల్లో కత్తిగూడెం రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వాసం ఎర్రయ్య, మండల బజారు, లంజపల్లి నాగేశ్వరరావు, కిషోర్, దారా నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సంఘసంస్కర్త ఫాతిమా షేక్

- సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్

**నవతెలంగాణ - ములుగు**



సాంఘిక దురాచారాలపై పోరాడి మహిళల విద్యాభివృద్ధికి కృషి చేసిన గొప్ప సామాజిక సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ అని ములుగు,భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ అన్నారు. సోమవారం ములుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆధునిక భారత తొలి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 192వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫాతిమా షేక్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆమె మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే దంపతులతో కలిసి మహిళ అభ్యున్నతికి, సామాజిక సేవకు నడుంగట్టిన మహనీయురాలు ఫాతిమా షేక్ అని అన్నారు. ప్రాచీన కాలంలో విద్య సామాన్యులకు అందని ద్రాక్షగా ఉండేదని, అలాంటి తరుణంలో కుటుంబానికి దూరంగా ఉండి అందరికీ విద్యను అందించడం కోసం అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, రిజిస్ట్రేషన్‌దారులు తదితరులు ఉన్నారు.



## ప్రవీణ్‌కుమార్ ఫోన్ ట్యాపింగ్‌పై ఫిర్యాదు

**నవతెలంగాణ-మల్హర్‌రావు**

బీఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫోన్ ట్యాపింగ్ చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని బీఎస్పీ నాయకులు మండలంలోని కొయ్యూర్ ఎస్ఐ నరేశ్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని రోజులుగా ప్రవీణ్‌కుమార్ ఆపిల్ కంపెనీ ఫోన్ ట్యాపింగ్ అయ్యిందని, కంపెనీ నుండి హెచ్చరికలు వస్తున్నాయని అన్నారు. దీనిపై డీజీపీ స్థాయిలో సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి కందుగుల రాజన్న, మండల అధ్యక్షులు గుగ్గిల్ల రాజ్ కుమార్, నాయకులు నక్క శ్రీకాంత్,అర్కుల రాజు,మహేష్ పాల్గొన్నారు.



## ఎల్‌ఓసీ అందజేత

**నవతెలంగాణ-మహదేవపూర్**

మహాదేవ్‌పూర్ మండల కేంద్రానికి చెందిన విలసాగరపు ప్రశాంత్‌కు రూ.2,00,000 విలువైన ఎల్ఓసి మంజూరైంది. సోమవారం బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ వ్యక్తిగత సహాయకుడు నిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లి సంబంధిత పత్రాన్ని లబ్దిదారుడికి అందజేశారు.



## కందకంలోకి దూసుకెళ్లిన కారు

**నవతెలంగాణ -మహాముత్తారం**

మద్యం మత్తులో దోస్త్ చిత్తయినా సంఘటన మహాముత్తారం మండలం పెగడపల్లి లో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మంథని పరిసర ప్రాంతానికి చెందిన ఏడుగురు ప్రాణ మిత్రులు సెలవు దినం ఆదివారంకావటంతొ మేడారం సమ్మక్క సారక్క వద్ద దావత్ చేసుకుందామని సోమవారం ఉదయం బయలుదేరారు. మార్గ మధ్యలో యమన్ పల్లిలో వైన్స్ తీసుకొని పెగడపల్లి ప్రధాన రోడ్డుకు పక్కన మందుకు సిట్టింగ్ కూర్చున్నారు. అందరూ మత్తులో ఉండగా మిత్రునిదే కారు గదా నేను కూడా తోలిస్తే పోలా అనుకుని డ్రైవింగ్ చేస్తూ బ్రేకులు అనుకోని ఎక్స్ లెటర్ ను తొక్కుతూ ఉండగా అధిక స్పీడ్ అయి కందకంలో కారు దూసుకుపోయింది. ప్రాణ నష్టం జరగలేదు.



## కాంగ్రెస్ యత్నారం గ్రామ కమిటీ ఎన్నిక

**నవతెలంగాణ -మహాముత్తారం**

మహాముత్తారం మండలంలో ఏఐసీసీ కార్యదర్శి మాజీ మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ మహాముత్తారం మండల అధ్యక్షుడు పక్కల సడవలి ఆధ్వర్యంలో యత్నారం గ్రామ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పెద్దల కిష్టయ్య, ఉపాధ్యక్షులుగా వాంకుడోత్ మంగు నాయక్, ప్రధాన కార్యదర్శిగా నునవత్ బొజ్జనాయక్‌ను ఎన్నుకున్నారు. జెడ్పీటీసీ లింగమల్ల శారద దుర్గయ్య, ఎంపీపీ రత్నం సుభద్ర సడవాలి, పీసీసీ మెంబర్ బెల్లంకొండ కిష్టయ్య, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జాడి రాజయ్య, సర్పంచ్ చీడం సుగుణ, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రంగు రవీందర్, సెల్ అధ్యక్షులు వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.



## సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

- వరంగల్ సీపీ ఏవీ రంగనాథ్

**నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి**

అధికారులు, సిబ్బంది సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి సారిస్తానని వరంగల్ పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీ వాహనాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ రంగనాథ్ మాట్లాడుతూ... వరంగల్, హన్మకొండ, కాజీపేట ప్రాంతాల్లో పనిచేసే పోలీసు సిబ్బంది 8454955555 నెంబర్‌కు ఫోన్ చేసి గ్యాస్ బుక్ చేసుకోవాలని కోరారు. మొదటి ప్రాధాన్యత ప్రకారం సిబ్బందికి సిలిండర్ డోర్ డెలవరీ వాహనం ద్వారా సిలిండర్ డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. 1999లో కోఆపరేటివ్ సొసైటీ ద్వారా గ్యాస్ పంపిణీ ప్రారంభమైందన్నారు. 2,133 మంది సిబ్బంది సభ్యులుగా ఉన్నారని, రానున్న రోజుల్లో సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించడం జరుగుతుందన్నారు. కాగా నిరంతరం విధులు నిర్వ హించే పోలీసు సిబ్బంది ఇంటి అవసరాల కోసం వినియోగించే వంట గ్యాస్ ను కమిషనరేట్ కార్యాలయ గ్యాస్ గోడౌన్ నుండి వారి ఇండ్లకు తరలిం చడంలో సిబ్బందితోపాటు కుటుంబసభ్యులకు సైతం పెనుభారంగా మారింది. దీనిపై పోలీసు కమిషనర్ ప్రత్యేక దృష్టి పెట్టి ఈ ఏర్పాటు చేశారు. ఏఆర్ అదనపు డీసీపీ సంజీవ్, ఏసీపీలు నాగయ్య, అనంతయ్య, పోలిస్ సంక్షేమం ఆర్ఐ నగేష్, ఎంటీఆర్ఐ భాస్కర్, ఆర్ఎస్సైలు నవీన్, భానుప్రకాశ్, స్వాతి, పోలిస్ అధికారుల సంఘం ప్రతినిధి శోభన్, గ్యాస్ విభాగం ఇన్‌ఛార్జి ఓదేలు, సిబ్బంది పాల్గొన్నారు.



## మొక్కలను సంరక్షించాలి : జెడ్పీ సీఈవో

**నవతెలంగాణ-చిట్యాల**

నర్సరీ ప్లాంటేషన్‌ను అభివృద్ధి చేసి మొక్కలను సంరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిదని జెడ్పీ సీఈఓ రఘువరన్ అన్నారు. సోమవారం మండలంలోని తిరుమలాపురం గ్రామపంచాయతీ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు అనంతరం గ్రామంలోని నర్సరీ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి అధికారుల హాజరు, పనితీరుపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## కొయ్యూర్ ఎస్ఐకి ఘన సన్మానం

**నవతెలంగాణ-మల్హర్‌రావు**

మండలంలోని కొయ్యూర్ నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నరేశ్‌ను సోమవారం కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మంత్రి రాజాసమ్మయ్య, పెద్దతూండ్ల గ్రామశాఖ అధ్యక్షుడు బియ్యని రాజామొగిలి మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడ్వాల సురేష్, బియ్యని శ్రీశైలం పాల్గొన్నారు.



## అంగన్వాడీ కేంద్రంను ఎంపీడీఓ తనిఖీ

**నవతెలంగాణ-మహదేవపూర్**


మహాదేవపూర్ మండలం అన్నారం గ్రామపంచాయతీ పరిధి అంగన్వాడీ కేంద్రం-3ను ఎంపీడీఓ శంకర్ సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు పోషక పదార్థాలు, వారి అటెండెన్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలామృతం, గుడ్లు, పాలు సక్రమంగా సకాలంలో తీసుకోవాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి మంజూరు నవాజుద్దీన్, కారోబార్ రవీందర్, అంగన్‌వాడీ టీచర్ సుశీల ఆయా పాల్గొన్నారు.



## రైతు సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు : తహసీల్దార్

**నవతెలంగాణ- ములుగు**

రైతుల సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు పనిచేస్తున్నాయని ములుగు తాహసిల్దార్ మధురకవి సత్యనారాయణ స్వామి తెలిపారు. రెవెన్యూ సదస్సులలో భాగంగా సోమవారం రామచంద్రపూర్ రెవెన్యూ పరిధిలోని పందికుంట గ్రామపంచాయతీలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 49 మంది రైతులు దరఖాస్తు చేసుకోగా ఇందులో 8 మంది రైతులకు మీసేవా ద్వారా గ్రామ పంచాయతీలో మీ సేవ ప్రతినిధి ద్వారా దరఖాస్తు చేయించారు. దీంతో రైతులు రైతుబంధు రైతు బీమా పొందుతారని తెలిపారు. సర్పంచ్ పసుల సాంబయ్య, ములుగు కలెక్టరేట్ సూపరింటెండెం ట్ విశ్వ ప్రసాద్, నాయబ్ తహసిల్దార్ చంద్రశేఖర్ మండల సర్వేయర్ సత్యనారాయణ, గ్రామ రెవెన్యూ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.





## విద్యారంగ సమస్యల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యం

**మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ**



నవతెలంగాణ-లింగాలఘనపురం

పాఠశాల విద్యారంగ సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, విద్యార్థుల కనీస అవసరాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు విమర్శించారు. మండల కేంద్రంలో విద్యా వనరుల భవనం వద్ద తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఐదవ మహాసభల సందర్భంగా గోడపత్రికను జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఉపాధ్యాయుల బదిలీలు లేవని, గత ఏడేళ్లుగా పదోన్నతులు లేవని, ఇప్పటికే పీఆర్సీ వేతన బకాయిల చెల్లింపులు లేవని, మెడికల్ రీ ఎంబర్సుమెంట్ బిల్లులు వేలాదిగా పెండింగులో ఉన్నాయని, సరెండర్ బిల్లులు చెల్లించడమే మర్చిపోయారని, ఈ జిల్లాలో ఈరోజు వరకు కూడా జీతాలు చెల్లింపులు జరగలేదని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని అన్నారు. రాష్ట్రంలో రెగ్యులర్ ఎంఇఓలు, డిప్యూటీ ఈఓలు లేరని, పంచాయతీ రాజ్ ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్ల పదోన్నతుల అవకాశం పునరుద్ధరణ చేయలేదని విమర్శించారు. ఇక మోడల్ స్కూల్, కస్తూర్బా, సాంఘిక సంక్షేమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ పాఠశాలలు, మైనారిటీ, బీసీ గురుకుల పాఠశాలల్లో అనేక సమస్యలు నెలకొన్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా తక్షణమే నూతన విద్యా విధానం 2020ను ఉపసంహరణ చేసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగంలో నెలకొన్న అనేక అపరిష్కృత సమస్యలను చర్చించేందుకు ఈ నెల 13 ,14 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర యూటీఎఫ్ 4వ విద్యా మహాసభలను రంగారెడ్డి జిల్లాలోని మన్నెగూడలోని బీఎంఆర్ సార్థ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభలను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభిస్తారని, అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ కే.నాగేశ్వర్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, కేరళ రాష్ట్ర శాసనసభ సభ్యురాలు కేకే.శైలజ హాజరుకానున్నారని వివరించారు. ఈ మహాసభలకు ఉపాధ్యాయులు, విద్యారంగం శ్రేయోభిలాషులు, మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాసరావు కోరారు. ఈ కార్యక్రమంలో లింగాలగణపురం మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్.నర్సింహులు, జి. కృష్ణ, మండల బాధ్యులు పి.మల్లారెడ్డి, ఈ.వీరయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నవాబ్‌పేట ప్రధానోపాధ్యాయులు సిహెచ్.ఆనంద్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యాభివృద్ధికి కృషి చేయాలి : శ్రీలత



నవతెలంగాణ-నరసింహులపేట

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు అందరూ కృషి చేయాలని మండలంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షులు ఎర్ర పూర్ణచందర్ ఆధ్వర్యంలో పిఆర్‌టియు టిఎస్ 2023 నూతన క్యాలెండర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యా వ్యవస్థ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడం, నాణ్యమైన విద్య అందించడంలో ఉపాధ్యాయుల కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ మండల ప్రధాన కార్యదర్శి కొండ సంజీవ, రాష్ట్ర, జిల్లా సంఘం బాధ్యులు కొండ్రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, హనుమాన్ల వెంకటరెడ్డి, నరేష్, మండల సంఘ బాధ్యతలు మోహన్ రెడ్డి, శ్రీను, కరుణాకర్ సీనయ్య, ప్రసాద్, సిఆర్పిలు శేషు, వీరన్న, నరహరి, ఐఆర్పిలు యకంబ్రం లు పాల్గొన్నారు.

## చైర్మన్ ప్రమాణస్వీకారానికి ఆర్యవైశ్యులు తరలిరావాలి

**మండల అధ్యక్షులు శ్రీనివాస్**



నవతెలంగాణ-నరసింహులపేట

మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో దేవస్థానం చైర్మన్ బొల్లం రమేష్ ప్రమాణస్వీకారానికి మండల ఆర్యవైశ్యులందరూ అందరూ కలిసి తరలివచ్చి విజయవంతం చేయాలని మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షులు చౌడావరపు శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవస్థానం చైర్మన్ ఆర్యవైశ్యులకు ఇవ్వడం వలన డోర్నకల్ ఎమ్మెల్యే డిఎస్ రెడ్యానాయక్ ఆర్యవైశ్యులు రుణపడి ఉంటారని ఆయన అన్నారు.ఈ అవకాశం మాకు ఇచ్చినందుకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కోశాధికారి బి.సోమేశ్వరరావు, మండల కార్యదర్శి ఉపేందర్, బొల్లం సోమన్న, వంగపల్లి సీతారాములు, మాశెట్టి వెంకన్న, యుగంధర్, ఇమ్మడి నాగన్న, సంతోష్, మహేష్, సిహెచ్.విక్రమ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు

## ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

**జిల్లా క్వాలిటీ కో-ఆర్డినేటర్ మహంకాళి బుచ్చయ్య**



నవతెలంగాణ-తొర్రూరు

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేసి విద్యను మరింత బలోపేతం చేయాలని విద్యాశాఖ జిల్లా పాలిటీ కోఆర్డినేటర్ మహంకాళి బుచ్చయ్య ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక హై స్కూల్ లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం ద్వారానే మెరుగైన ఫలితాలు సాధించవచ్చు అని ఆయన తెలిపారు. అనంతరం దంతాలపల్లి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని తెలిపారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు లేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వెంటనే షెడ్యూల్ విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం డీటీఫ్ జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్ మాట్లాడుతూ 317 జీవో వల్ల అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని,మూడు కరువుభాత్యాలు పెండింగ్‌లో ఉన్నాయని,వాటిని వెంటనే విడుదల చేయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో పెద్దవంగర బాధ్యుడు బి.కృష్ణ, మోమిన్ అలీ, మండల ప్రెసిడెంట్ తిరుమలేష్, ప్రధాన కార్యదర్శి దర్గయ్య, కమిటీ సభ్యులు కరుణాకర్, దేవదాస్, శ్రీనివాసరెడ్డి, కుమారస్వామి పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

**మంత్రులు దయాకర్ రావు, సత్యవతి రాథోడ్**



నవతెలంగాణ- తొర్రూర్ రూరల్

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌లు అన్నారు. మండలంలోని నాంచారి మదూరు గ్రామ బిఆర్ఎస్ యువజన నాయకుడు శీల హరీష్ సోమవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌లను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా మంత్రులు మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు యువజన నాయకులు కృషి చేయాలన్నారు. పార్టీ అభివృద్ధిలో యువత పాత్ర కీలకమన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

**అధికారులకు జిల్లా కలెక్టర్ శివలింగయ్య ఆదేశం**



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ప్రజావాణిలో ప్రజల నుండి వివిధ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని జిల్లా అధికారులను కలెక్టర్ సిహెచ్.శివలింగయ్య ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఆయన ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిశీలించాలని ఆదేశించారు. వివిధ శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు వివరాలను అడిగి తెలుసుకుని వాటికి సమాధానాలు పంపాలన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రతీ జిల్లా అధికారి తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. కాగా సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు 42, డిఆర్డిఓకు 4, ఇరిగేషన్ 2, డిపిఓ 4, మొత్తం 66 దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారులు మధుమోహన్, కృష్ణవేణి, డిఆర్‌డిఓ రామిరెడ్డి, రాధిక, సిపిఓ ఇస్మాయిల్, డీఎస్ఓ రోజారాణి, సివిల్ సప్లై డిస్ట్రిక్ట్ మేనేజర్ సంధ్యారాణి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**మనఊరు-మనబడి పనులను వేగవంతం చేయాలి - జాయింట్ డైరెక్టర్ సరోజినీ దేవి**



నవతెలంగాణ-పెద్దవంగర

కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని పాఠశాల విద్య జాయింట్ డైరెక్టర్ సరోజినీ దేవి ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని అవుతాపురం, గంట్లకుంట, చిట్యాల పాఠశాలలను ఆమె సందర్శించారు. ఆయా పాఠశాలల్లో కొనసాగుతున్న మన ఊరు-మనబడి పనులను ఆరాతీశారు.డైనింగ్ హాల్ నిర్మాణం, విద్యుత్, ఈజీఎస్ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మనఊరు-మనబడి కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందన్నారు. మండల వ్యాప్తంగా 12 పాఠశాలలను ఎంపిక చేయగా, మొదటి దశలో నాలుగు పాఠశాలలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. పాఠశాలలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు సకల సౌకర్యాలు కల్పిస్తుందని పేర్కొన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించి, ఉత్తమ ఫలితాలు సాధించాలని ప్రేరణ కల్పించారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని లక్ష్యసాధనకు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించాలని, పదిలో 10 జీపీఏ లక్ష్యంగా చదవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఆలందాస్ బిక్షపతి, శ్రీనివాస్, వెంకన్న, ఎస్ఎంసీ చైర్మన్ సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు క్షీర సాగర్ రవికుమార్, రమేష్, రామ్మోహన్, రవి, శ్రీను, నరసింహ, రత్నం, సంతోష్ కుమార్, సునీత, గోవర్ధన్, సురేష్, రామతార, తదితరులు పాల్గొన్నారు.

## అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి : అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్



నవతెలంగాణ-మహబూబాబాద్

ప్రజలు అందజేసిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్ అన్నారు.సోమవారం గ్రీవెన్స్ డే పురస్కరించుకొని కలెక్టరు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యు అదనపు కలెక్టర్ విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా కురవి మండలం సుదాన్పల్లి గ్రామానికి చెందిన ఫర్జానా బేగం వితంతు ఫించను కోసం దరఖాస్తు చేసుకోగా రేషన్ కార్డు అడుగుతున్నారని, రేషన్ కార్డు ఇప్పించి వితంతు ఫించను మంజూరు చేయాలని కోరారు. కేసముద్రం మండలం మహమూద్ పట్నం గ్రామానికి చెందిన రైతు తోకల వెంకటయ్య సర్వే నెం.485/5 లో గల 5 ఎకరాల మెట్ట భూమిని కొప్పుల లచ్చమ్మ వారి వద్ద 1967లో ఖరీదు చేసినానని ఇట్టి భూమి పట్టాకొరకు 2018లో సాదాబైనామాకు, 2020లో మీ సేవలో కూడా దరఖాస్తు చేసుకున్నానని, ఇట్టి భూమిని నా పేరు పైన రికార్డు చేసి పట్టా ఇప్పించగలరని విజ్ఞప్తి చేశారు. గార్ల మండలానికి చెందిన మంగలి శంకరమ్మ తన భర్త 2020లో కోవిడ్ వలన మరణించాడని, జీవనోపాధి ఇబ్బందిగా ఉందని బ్రతుకు దెరువు కొరకు ఎటువంటి ప్రత్యమ్నాయాలు లేవని, 10వ తరగతి దాకా చదివి ఉన్నానని, గార్ల ప్రభుత్వ పాటశాల యందు ఖాళీగా గల కుక్, అసిస్టెంట్ కుక్, స్కావెంజర్ పోస్టుకు దరఖాస్తు చేస్తున్నానని ఏదైనా ఒక పోస్టు ఇప్పించి జీవనోపాధి కల్పించాలని కోరారు. మహబూబాబాద్ పట్టణానికి చెందిన ఎస్.డి ఇమామ్ గత కొన్ని సంవత్సరాలుగా కిరాయి ఇంట్లో ఉంటూ జీవనోపాధికై పాములు పట్టుకుంటున్నానని, ప్రభుత్వం మంజూరు చేస్తున్నటువంటి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరు చేయగలరని కోరారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 70 ధరఖాస్తులు వచ్చాయి. ఈ ప్రజావాణిలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాకంటక పాలన సాగిస్తున్న బీజేపీ : ఎమ్మెల్యే రాజయ్య

**రూ. 2.80కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన - మహిళా గ్రామ సంఘానికి రూ.20 లక్షలు**



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

కులాల, మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ పాబ్బం గడుపుతోన్న మతతత్వ బీజేపీ ప్రజా కంటక పాలన సాగిస్తున్నదని రాష్ట్ర తొలి ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అమర వీరుల స్థూపం నిర్మాణానికి భూమి పూజ చేసి, జీపి కాంప్లెక్స్ భవనం రూ.60లక్షలు, క్రీడా ప్రాంగణం రూ. 8.29లక్షలు, సీసీ రోడ్లు రూ.8లక్షలు, రూ. 94 లక్షలు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి పైపు లైన్ నిర్మాణం పనులు, సెంట్రల్ లైటింగ్ రూ. 19లక్షలు, దళిత బంధు సహకారంతో 70లక్షల యూనిట్లను ప్రారంభించారు. ముందుగా ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా కళాకారులు, డబ్బు చప్పుళ్లతో, కోలాటాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో సర్పంచ్ తాటికొండ సురేష్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలోరాష్ట్రంలోని 12769 పంచాయితీల్లో ఏకకాలంలోసర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని, దేశంలోని 28రాష్ట్రాల్లోకెల్లా ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ తెలంగాణా రాష్ట్రం నెంబర్‌వన్ స్థానంలో నిలిచిందన్నారు. మోడీ మొండిగా వ్యవహరిస్తూ, దేశ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారనివిమర్శించారు. రైతు వ్యతిరేక చట్టాల్ని తెచ్చి, 750 మంది ప్రాణాలను పొట్టన పెట్టుకున్న దౌర్భాగ్య ప్రభుత్వమని, మోటార్లకు మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తున్నదన్నారు. అన్నింటా జీఎస్టీ పేరిట పెంచి, పేదప్రజల నడ్డివిరిచే పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ దయతో అడిగిన వెంటనే అనేక సంక్షేమ అభివృద్ధి పనులు ఇక్కడ మంజూరీ చేశారని అదనంగా ఇటీవల మంజూరైన మహిళా డిగ్రీ కళాశాల నిదర్శనమన్నారు.తాను బ్రతికున్న కాలం నియోజకవర్గ ప్రజలే దేవుళ్ళుగా, నియోజకవర్గమే దేవాలయంగా భావించి ఎవరెన్ని ప్రయత్నాలు చేసిన స్థానికుడిగా ప్రజందరికీ తనవంతు బాధ్యతగా సాయంగా ఉంటానని, ప్రభుత్వ పథకాలైన దళిత బంధు ద్వారా ప్రతీ దళిత కుటుంబాలకు అందించి తీరుతానని తెలిపారు. మండలకేంద్రంలో గ్రామైఖ్య మహిళా సంఘం నూతన భవనం నిర్మాణానికి 20 లక్షలు మంజూరు చేశారు. నిరుపేదలకు డబల్ బెడ్‌రూం ఇండ్లు 210 కేటాయించి, సంక్రాంతి లోపు కేటాయించే దిశగా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలోజెడ్పీస్టాండింగ్ కమిటీ చైర్మన్ మారపాక రవి, డీఆర్డీఓ రాంరెడ్డి, ఎంపిపి కందుల రేఖ, ఆఫీస్ ఇంచార్జీ ఆకుల కుమార్, ఈఢి వెంకన్న, ఏఎంసీ చైర్మన్ గుజ్జరి రాజు, వైస్ చైర్మన్ చల్లా చందర్ రెడ్డి, ఎంపిటిసిలు గన్ను నర్సింహులు, దయాకర్, రాజు, ఉప సర్పంచ్ ఐలయ్య, ఏఎంసీ డైరెక్టర్లు పెంతల రాజ్ కుమార్, సరితాంజనేయులు, మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, డీఎల్పీఓ వెంకటప్రసాద్, ఎంపీడీఓ క్రిష్ణ, ఎంపీఓ సుధీర్ కుమార్, ఈఓ సత్యనారాయణ, మారేపల్లి ప్రసాద్, తాటికొండ రమేష్, బొంకూరి మహేష్, గాదె రాజు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# బాంబు పేలుడు కలకలం

## విచారణ చేస్తున్న సీఐ, ఎస్ఐలు



నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని పెద్ద చెరువు సమీపంలో బాంబు పేలుడు మండలంలో కలకలంగా మారింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోటగడ్డ సమీపంలోని పెద్ద చెరువు కట్టపై ఆదివారం సాయంత్రం బాంబు పేలుడు కలకలం సృష్టించిందని, జిల్లాలోని కురవి మండలం ఊరు గుండ్రాతి మడుగు గ్రామానికి చెందిన నలుగురు రైల్వే ఉద్యోగులు బోదంగండ్ల రవి కుమార్, కూస రాజు, పుష్పల మహేష్, కోమరెల్లి వ్యక్తులు ఆదివారం సాయంత్రం పెద్ద చెరువు కట్టపై భోజనాలు ఏర్పాటు చేసుకొని, మద్యం సేవించి ఆహ్లాదకరంగా గడిపినారని తెలిపారు. ఈ క్రమంలో అందులో నుంచి రవి అనే వ్యక్తి బహిర్భూమికి బయటకు వెళ్లి, కొంత సమయం అయిన తర్వాత ఒక్కసారిగా బాంబు పేలుడు శబ్దం వినిపించడంతో మిగిలిన స్నేహితులు అక్కడికి చేరుకొని గాయలపాలైన రవిని ఆస్పత్రికి తరలించారని తెలిపారు. రవి రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయని, గాయాలపాలైన రవికి హైదరాబాదులో చికిత్స జరుగుతుందని తెలిపారు. ఈ సంఘటన పై సోమవారం సిఐ బాలాజీ, ఎస్ఐ రమాదేవి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. బాంబు పేలుడు ఎలా సంభవించింది..? ఆ స్థలానికి బాంబు ఎలా వచ్చింది..? అనే కోణంలో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

## సీఎం కేసీఆర్ పర్యటన విజయవంతం చేయాలి

**స్వాగతం పలికేందుకు కార్యకర్తలు వేలాదిగా తరలిరావాలి**

**పాలకుర్తిలో సందడి చేసిన మంత్రులు ఎర్రబెల్లి, సత్యవతి, ఎంపీ కవిత**

నవతెలంగాణ-పాలకుర్తి

ఈనెల 12న మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయం ప్రారంభానికి సీఎం కేసీఆర్ హాజరవుతున్నారని, సీఎం పర్యటనను ప్రజలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని రాష్ట్ర మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మహబూబాబాద్ ఎంపీ మాలోతు కవితలు తెలిపారు. ఈనెల 12న మహబూబాబాద్‌లో సీఎం కేసీఆర్ కలెక్టర్ కార్యాలయం ప్రారంభం పర్యటన సందర్భంగా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్‌లతో పాటు ఎంపీ కవిత ఏర్పాట్లను పరిశీలించేందుకు వెళ్లే క్రమంలో సోమవారం మండల కేంద్రంలో గల ఎస్ఆర్‌టి పాయింట్‌లో టీ తాగుతూ, సమోసాలు తింటూ పాన్ వేసుకొని సందడి చేశారు. టీ తాగేందుకు ఆగిన మంత్రులను చూసి ప్రజా ప్రతినిధులు, అభిమానులు గుమిగూడారు. మంత్రులతోపాటు ఎంపీకిఎస్సార్ టి పాయింట్ యజమాని కాటబత్తిని సోమేశ్వర్ టీ, సమోసాలతోపాటు పాన్ అందజేశారు. ఈనెల 18 నుండి నిర్వహించే రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నల్ల నాగిరెడ్డి, జడ్పీ ఫ్లోర్ లీడర్ శ్రీనివాసరావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎండి.మదర్, ఐలమ్మ మార్కెట్ కమిటీ చైర్మన్ ముస్కు రాంబాబు, పాలకుర్తి సొసైటీ చైర్మన్ బొబ్బల అశోక్ రెడ్డి, సర్పంచ్, ఎంపీటీసీలు బొమ్మగాని కొమురయ్య, మాటూరి యాకయ్య, గుగులోతు లక్పతి, బెల్లి సోమయ్య, కత్తి సైదులు, నాయిని మల్లారెడ్డి, బిఆర్ఎస్ మండల సంయుక్త కార్యదర్శి దొంతమల్ల గణేష్, బిఆర్ఎస్ నాయకులు గజ్జి సంతోష్, ఎడవల్లి కృష్ణతో పాటు బిఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.









## మహాసభలను విజయవంతం చేయండి

నవతెలంగాణ-కొత్తగూడ

ఈనెల 13,14 వ తేదీలలో రంగారెడ్డి జిల్లాలో జరిగే టీఎస్ యుటిఎఫ్ ఐదవ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మల్కం వీరస్వామి పిలుపు నిచ్చారు. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కేంద్రం వద్ద నూతన సంవత్సర క్యాలెండర్లతో పాటు మహాసభల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షులు తురుస శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి సుభాష్, నాయకులు సమ్మయ్య, శ్రీనివాస్, నరసింహారావు, నారాయణ, సుబ్బారావు, రామ్ చందర్, శివ కష్ణ, రాధిక, కిషింధర్ తదితరులు పాల్గొన్నారు.

## కరువుభత్యం వెంటనే చెల్లించాలి : డీటీఎఫ్



నవతెలంగాణ-కొత్తగూడ

బకాయి ఉన్న కరువు బత్యం వెంటనే చెల్లించాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు నెల్లుట్ల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని మండల విద్యావనరుల కేంద్రం వద్ద డిటిఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలన్నారు. అంతేకాకుండా మెడికల్ బిల్లులు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఈసాల లక్ష్మయ్య, మండల అధ్యక్షులు చాట్ల పొట్టయ్య, ప్రధాన కార్యదర్శి వాసం ప్రభాకర్, నాయకులు ఈసం సారంగపాణి, ప్రమీల, సరస్వతి, సుధాకర్, యాప బ్రహ్మయ్య, మమత, రమేష్, మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-పెద్దవంగర

డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) 2023 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు రమేష్ బాబు, బొమ్మెర కష్ణ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మార్సీలో సోమవారం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. 8 ఏళ్లుగా పదోన్నతులు చేపట్టకుండా కాలయాపన చేస్తుందన్నారు. పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్, అమర్, రామచంద్రు, రాజలింగం, సదయ్య, విజయ్ కుమార్, వెంకన్న, శ్రీధర్, శ్రీనివాస్, సీఆర్పీ సంతోష్ పాల్గొన్నారు.

## శివాజీ కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-బయ్యారం

మండల పరిధిలోని వెంకట్రాంపురం బిఆర్ఎస్ గ్రామ శాఖ కార్యదర్శి దారావత్ శివాజీ తండ్రి దారావత్ బద్రు నాయక్ అనారోగ్య కారణంగా మృతి చెందారు. సోమవారం మండల వైస్ ఎంపీపీ, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తాతా గణేష్ వారి కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెండ్యాల సుధాకర్, ఇస్లావత్ వీరన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-తొర్రూర్ రూరల్

మండలంలోని ఫతేపురం గ్రామానికి చెందిన కొత్తగట్టు హరీష్ ఇటీవల ఆత్మహత్య చేసుకోవడం జరిగింది. వారి యొక్క బాల్యమిత్రులు వారి కుటుంబానికి 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ వారి కుటుంబానికి ఎల్లవేళలా తోడుంటామని స్నేహితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిత్రులు తరాల సందీప్, బొజ్జ ఉమేష్, గణేష్, మురళి, సురేష్, యాకన్న, శోభన్ బాబు, వేణు, కార్తీక్, సతీష్, నరేష్, సంతోష్, రాకేష్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

## వాటర్‌మెన్ కుటుంబానికి ఆర్థిక సహాయం



నవతెలంగాణ-కొకండ్ల

కొడకండ్ల గ్రామ పంచాయతీలో వాటర్ మెన్‌గా పనిచేస్తున్న సున్నపూర్ శ్రీనివాస్ 10 రోజుల క్రితం విద్యుత్‌షాక్‌తో మృతి చెందగా సోమవారం గ్రామస్తుల ద్వారా సేకరించిన 52,500 రూపాయల ఆర్థిక సహాయాన్ని ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఈదురు ఐలయ్య పరామర్శ



నవతెలంగాణ-పెద్దవంగర

మండలంలోని కొరిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర అంజయ్య (46) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య నాయకులతో కలిసి మృత దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట మండల ప్రధాన కార్యదర్శి శ్రీరాం సంజయ్ కుమార్, అధ్యక్షుడు ఆరుట్ల వెంకట్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఎర్ర సబిత వెంకన్న, శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ముజీబ్, కష్టారెడ్డి, చిరంజీవి, యాకయ్య యాదగిరి ఉన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంతో పొంచి ఉన్న ప్రమాదం



నవతెలంగాణ-డోర్నకల్

డోర్నకల్ మండల పరిధిలోని బొడ్రాయి తండా పాఠశాల సమీపంలో ఉన్న నర్సరీకి వెళ్లే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. దాని చుట్టూ ఎలాంటి రక్షణ వలయం ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదం పొంచి ఉంది. అందువల్ల విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె నిర్మించాలని తండా వాసులు కోరుతున్నారు.అంతే కాకుండా పాఠశాలకు ప్రక్కనే ఉండటంతో విద్యార్థులు వారి తల్లితండ్రులు ఉపాధ్యాయులు ఆందోళనకు గురి అవుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే భద్రతావాలయం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు.

అనుదినం జనస్వరం
# నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక







## ఎస్సీ ఎస్టీలకు 100 యూనిట్ల విద్యుత్ ఉచితం

**నవతెలంగాణ-వరంగల్**

ఎస్సీ ఎస్టీ విద్యుత్‌ను మీటర్ ద్వారా వాడుకుంటున్న వినియోగదారులకు నెలకు 100 యూనిట్ల విద్యుత్ వరకు ఉచితంగా వాడుకొనుటకు ప్రభుత్వం ఇస్తుందని ఏడీఈ మాధవరావు ఒక ప్రకటన విడుదల చేశారు.కుక్కేముల ద్వారా విద్యుత్ వాడుకుంటే విద్యుత్ అంతరాయం కలుగుతుంది. మీటర్ లేకుండా విద్యుత్తును వాడుకుంటే పలువురికి కేసులు అవుతున్నాయి. కావున ఎస్సీ,ఎస్టీలు కుల ధృవీకరణపత్రం విద్యుత్ అధికారులకు అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకుంటే వారికి ప్రతీ నెల 100 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్తును వాడుకునే వెసులుబాటు ప్రభుత్వం ఇచ్చింది. ఈ అవకాశాన్ని ఎస్సీ ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. రేపటి ఎస్సీ,ఎస్టీల అవగాహన సదస్సు గొర్రెకుంట లో నిర్వహిస్తున్నారని సంబంధిత విద్యుత్ అధికారులు పేర్కొన్నారు.

## పూలే దంపతుల ఆశయాలను కొనసాగిద్దాం

**నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా**



హనుమకొండ కుమార్‌పల్లి న్యూలయోలా హై స్కూల్‌లో ఆధునిక భారతతొ లిముస్లిం ఉపాధ్యాయురాలు, పూలే దంపతుల ఆశయాలను నిలబెట్టిన సంఘ సంస్కర్త ఫాతిమా షేక్ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి కరస్పాండెంట్ తాడిశెట్టి క్రాంతికుమార్, సుప్రజ, వాజిద్ అలీ, అఫ్రీన్, గౌసియా పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎస్సై

**నవతెలంగాణ-చెన్నారావుపేట**



క్రీడలతో మానసిక ఉల్లాసంగా ఉంటుందని క్రీడలతో యువకులకు ఉద్యోగాలలో ప్రత్యేక స్థానం దక్కుతుందని ఎస్ఐ తోట మహేందర్ అన్నారు. సోమవారం మండల పరిధిలో జాగతి విద్యానికేతన్ మైదానంలో యువ నాయకుడు కందికొష్ట చైతన్య సహకారంతో ఫ్రెండ్స్ యువ జన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఆటల పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతియేటా ఆటల పోటీలను నిర్వహిస్తు క్రీడాకారుల నైపుణ్యాన్ని శక్తి సామర్థ్యం పెంచడానికి వారి భవిష్యత్తు మంచి అవకాశం కల్పిస్తున్న చైతన్యకు, ఫ్రెండ్స్ యువజన సంఘం నాయకులకు, ఆర్గనైజర్ కు ప్రత్యేక ధన్య వాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పి కోఆప్షన్ సభ్యుడ ఎండి రఫీ, మాజీ జెడ్పీటిసి రాంరెడ్డి, కరస్పాండెంట్ ఈగ సత్యనారాయణ ,మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు సాదు నర్సింగరావు, సర్పంచ్ లావణ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు కందకట్ల సాంబయ్య, వార్డు సభ్యుడు శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-పర్వతగిరి**



మండల కేంద్రం లోని స్థానిక జెడ్పీఎస్ ఎస్ పాఠశాల ఆవరణలో సోమవారం భోజనం విరామం సమయంలో డిటిఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను సోమవారం మండల నోడల్ ఆఫీసర్ జి.లింగారెడ్డి ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడారు. డైరీలు ఉపాధ్యాయ వృత్తికి సూచికంగా పనిచేస్తాయని తెలిపారు .ప్రభుత్వ జీవోలను తెలిపేందుకు డైరీలను వినియోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మహంకాళి రామస్వామి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగాఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏ బకాయిలను చెల్లించాలని, బదిలీలు ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని, సిపిఎస్ ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల డిటిఎఫ్ అధ్యక్షులు మిట్టపల్లి నాగేశ్వరరావు,ప్రధాన కార్యదర్శి కందగట్ల రమేష్,హెచ్ఎంలు జలీల్, చంద్రమౌళి, మండల బాధ్యులు బసికె రాజు, రవీందర్, చంద్రశేఖర్, కిషన్, ప్రసన్న లక్ష్మి, కుబ్రా, ప్రతిభ, హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

**నవతెలంగాణ-సుబేదారి**



ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులకు ఎలాంటి కాలయాపన లేకుండా తక్షణమే స్పందించి పరిష్కరించ వలసినదిగా హన్మకొండ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో వస్తున్న ఫిర్యాదులకు జిల్లా నలుమూలల నుంచి 70 దరఖాస్తులు, వినతులను డి.ఆర్.ఓ వాసు చంద్ర, డిఆర్డిఓ శ్రీనివాస్‌లు తీసుకొని అట్టి వినతుల పై తగు చర్యలు తీసుకోవలసిందిగా ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ అధికారి మేన శ్రీను, ఇండస్ట్రీ జీం హరికృష్ణ, డిడబ్ల్యూఓ సబితా, డీఎస్ ఓ.వసంతక్ష్మి, ఎస్సి కార్పొరేషన్ ఈడి మాధవి లత తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## టీఎస్ యుటిఎఫ్ మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

**నవతెలంగాణ-హనుమకొండ**

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్( టీఎస్ యుటిఎఫ్) ఐదవ రాష్ట్ర మహాసభలు రంగారెడ్డి జిల్లా మన్నెగూడ లోని బిఎంఆర్ పార్థ కన్వెన్షన్స్ లో ఈనెల 13, 14 తేదీలలో జరుగుతాయని టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాష్ట్ర కార్యదర్శి కే. సోమశేఖర్ వెల్లడించారు. రాష్ట్ర మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే సోమశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో జరిగే ఇట్టి మహాసభలకు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి శ్రీమతి పి సబితా ఇంద్రా రెడ్డి, కేరళ రాష్ట్ర మాజీ ఆరోగ్య శాఖ మంత్రి, కేరళ ప్రభుత్వ విప్ కేకే శైలజ, ముఖ్య అతిథులుగా పాల్గొంటారని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కె నాగేశ్వర్‌చే స్వాగత ఉపన్యాసం ఉంటుందని తెలిపారు. విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై విద్యావేత్త ,మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ చుక్కా రామయ్య , ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి విద్యా సదస్సులు, విద్యారంగ ,ఉపాధ్యాయ సమస్యలపై కూలంకషంగా చర్చించి ఒక డ్రాఫ్టును రూపొందిస్తామని తెలిపారు. రెండు రోజులపాటు జరిగే ఈ మహాసభలలో తొలిరోజు 13న జరిగే ప్రారంభ కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. రెండవ రోజు ప్రతినిధుల సభ జరుగుతుందన్నారు.

ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో టీఎస్ యుటిఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏం. సదాశివరెడ్డి, పెండెం రాజు ,జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్ రవీందర్ రాజు, జిల్లా కోశాధికారి డి కిరణ్ కుమార్ ,జిల్లా కార్యదర్శులు సిఎస్ఆర్ మల్లిక్, శశిధర్ రెడ్డి, ఎండి.స్టాలిన్ బేగ్, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ కే సదానందం, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సిహెచ్ లింగారావు, బాధ్యులు బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.




## బీఆర్ఎస్‌తోనే దేశంలో గుణాత్మక మార్పు : ఎమ్మెల్యే చల్లా



### రూ.20లక్షలతో జీపీ భవనాలకు శంకుస్థాపన

**నవతెలంగాణ-ఆత్మకూర్**

దేశంలో గుణాత్మక మార్పు రావాలంటే కేంద్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని మల్కపేట, హౌసుబుజుర్లు గ్రామాల్లో రూ.20లక్షలతో నూతనంగా గ్రామ పంచాయితీ భవనాలకు శంకు స్థాపన చేశారు. ఈసందర్భం ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశమంతా విస్తరించాలనే ఆకాంక్ష ప్రతి ఒక్కరిలోనూ ఉన్నదని. ధర్మారెడ్డి అన్నారు. దేశంలో ఉన్న సంపద ప్రజలందరికి అందాలనే దఢ సంకల్పంతో బీఆర్ఎస్ ముందుకు సాగుతుందన్నారు. దేశ ప్రజల ఆకాంక్షలు నెరవేర్చడానికి ఉద్యమ స్ఫూర్తితో సీఎం కేసీఆర్ నడుం కట్టారని కొనియాడారు. బీజేపీ నాయకులు నోటికి ఏది వస్తేఅది మాట్లాడటం ఫ్యాషన్‌గా మారిందని ఎద్దేవాచేశారు.ఫ్యాన్షన్స్ వస్తుపోతుంటాయని అలాంటి వారిని పట్టించుకోవద్దన్నా రు. బీజేపీ నాయకులు కుట్రలను ప్రతి ఒక్క కార్యకర్త తిప్పి కొట్టాలన్నారు. గ్రామాల్లో బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తే, వారిని నిలదీయాలన్నారు.

ఈకార్యక్రమంలో ఎంపీపీ మార్క సుమలతరజనీకర్, జడ్పీటీసీ కక్కెర్ల రాధికా రాజు, సర్పంచ్లు మాడిశెట్టి వేణుగోపాల్, రబీయాబీహుస్సేన్, రెడ్ క్రాస్ డైరెక్టర్ దుంపల్లపల్లి బుచ్చిరెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మెన్ అంబాటి రాజస్వామి, డీఈ లింగారెడ్డి, రైతు మండల కో-ఆర్డినేటర్ రవీందర్, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణే పోలీసుల లక్ష్యం

**నవతెలంగాణ-ఆత్మకూర్**



అతివేగం అజాగ్రత్త వల్ల జరుగుతున్న ప్రమాదాల నివారణే పోలీసులు లక్ష్యంగా పెట్టుకొని పని చేయాలనీ ఈస్టు జోన్ డిసిపి వెంకట లక్ష్మి సూచించారు. సోమవారం ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ జాతీయ రహదారి పై వాహనాల తని ఖీలను నిర్వహించిన అనంతరం పోలీసులకు పలుసూచనలు సలహాలను ఇచ్చారు. వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేస్తే క్రిమినల్ కేసులను నమోదు చేయాలనీ అన్నారు. వాహనాలకు రిజిస్ట్రేషన్,ఇన్సూరెన్స్,డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎవరైనావాహనాలు నడిపితే వారిపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారి కావడంతో వాహనదారులు పలు జాగ్రత్తలు తీసుకోవాలని డిసిపిసూచించారు. రెగ్యులర్ గ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తూ ప్రమాదాల నివారణ కోసం నిరంతరం నిర్వహించాలన్నారు. వాహనదారులు ఎవరైనా మద్యం సేవించి నడిపినట్టయితే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. యువకులు అతివేగం,అజాగ్రత్త వాహనాలు నడుపుతున్నారని వారి పై దృష్టి సారించి కేసులు నమోదు చేస్తే భవిష్యత్తులో ఎలాంటి ఉద్యోగాలు రావన్నారు యువత పోలీసులకు సహకరిస్తూ జాగ్రత్తగా వాహనాలను నడపాలని ప్రతిఒక్కరు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాన్ని నడుపవద్దని అన్నారు. నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయాలనీ పోలీసులకు సూచించారు. ఈ వాహనాల తనిఖీలలో పరకాల ఏసిపి శివరామయ్య,ఆత్మకూరు సిఐ గణేష్,పోలీసులు తదితరులు ఉన్నారు.

## మాస్టర్ ప్లాన్‌పై తప్పుడు ప్రచారం నమ్మొద్దు

### మున్సిపల్ కమిషనర్ గొడిశాల రవీందర్

**నవతెలంగాణ-వర్ధన్నపేట**



వర్ధన్నపేట మున్సిపాలిటీ సంఘం భవిష్యత్ ప్రణాళిక కోసం రూపొందిస్తున్న మాస్టర్ ప్రణాళిక పై కొంతమంది పని గట్టుకొని తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని వాటిని నమ్మవద్దని రైతులకు , ప్రజలకు వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్ విజ్ఞప్తి చేసారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిజానికి మాస్టర్ ప్లాన్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ కుడా ప్రభుత్వం ఇవ్వలేదు, డ్రాఫ్ట్‌నోటిఫికేషన్ ఇచ్చిన అనంతరం 60రోజుల్లో ప్రజలు, రైతులు నుండి అభ్యంతరాలను తీసుకొని ఎవ్వరికి ఎలాంటిలి నష్టం జరగకుండా మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని కమీషనర్ తెలిపారు . కౌన్సిల్ సమావేశంలో డ్రాఫ్ట్ మాస్టర్ ప్లాన్ సందర్భం లో ప్రతి విషయాన్ని వివరించినప్పటికి కొందరు తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారు.మరి కొందరు సమావేశానికి రాకుండానే వార్తలను తప్పుగా ప్రజల్లోకి తీసుకెళుతున్నారని ఇది సరైంది కాదని కోరారు. మాస్టర్ ప్లాన్ అమలు వల్ల ఏ ఒక్కరి భూమికి నష్టంజరగదని ఇంకా ఏ ఇతర నష్టాలు జరగవని తెలిపారు. తహసిల్ కార్యాలయం వెనుకాల నోటిసు ఇచ్చి భూములు లాకుంటారని ఆరోపణ చేయడం సరైంది కాదు అని తెలిపారు. మాస్టర్ ప్లాన్‌కి నెల క్రితం ఇచ్చిన ఈ నోటీసుకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు . గతంలో కాలువ ఉండేదని ఆకలువ నుండి రోడ్డు నిర్మాణం చేస్తే రైతులకు ఉపయోగపడుతుందని కొంత మంది రైతులు అభ్యర్థిస్తే ఆ కాలువ పునరుద్దరణ కోసం ప్రయత్నించినట్లు కమీషనర్ తెలిపారు. రైతులకు , ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉండాల్సిన కొందరు వారి స్వంత స్వార్థంకోసం మాస్టర్‌ప్లాన్‌పై అపోహలను , అసత్యాలను ప్రచారం చేసి పబ్బం గడుపుకోవాలనే ఆలోచనలను మానుకోవాలని కోరారు. మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్ట్ నోటిఫికేషన్ రాగానే ఈప్లాన్‌పై విస్తృత ప్రచారం చేసిన అనంతరమే అమల్లోకి తెస్తామన్నారు. అసత్య ప్రచారాలనుచేస్తే చట్టపరమైనచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ముగ్గుల పోటీలతో మహిళల్లో సృజనాత్మకత






**నవతెలంగాణ-మట్టెవాడ**

సిఐటియు నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడం సంతోషదాయకంగా ఉందని 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి, సిఐటియు రాష్ట్ర శ్రామిక మహిళా నాయకురాలు కాసు మాధవి, అన్నారు. కరీమాబాద్ సీఐటీయూ ఆధ్వర్యంలో 32వ డివిజన్లో మహిళల మధ్య ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిఐటియు జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి తో విచ్చేసిన వారు పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులను అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ 32వ డివిజన్లో శ్రామిక వర్గానికి చెందిన మహిళలు ఎంతో మంది ఉన్నారని, పనులకు, పరిమితం కాకుండా కళా రూపాలకు దోహదం చేసే ముగ్గుల పోటీలలో పాల్గొని వారి ప్రతిభను తెలియజేయడం ఆనందంగా ఉందని అందుకు శ్రామిక మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న విధంగానే పేద శ్రామిక మహిళలు వారికి దక్కాల్సిన హక్కుల కోసం మహిళలరక్షణ కోసం పాలకులతో పోరాడాలని పిలుపునిచ్చారు.

శ్రామిక మహిళలకు పనులులేక కనీసం వేతనం అమలుగాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని మహిళలపట్ల చిన్నచూపు చూస్తున్న సమా జం గానీ, ప్రభుత్వాలు గాని సరైన న్యాయం చేయలే కపోతున్నారని ఆవేదన చెందారు. మహిళలను కేవ లం ఓటు హక్కుగా చూస్తున్నారని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరిచే శ్రామిక మహిళలకు సంక్షేమ పథకాలు డబుల్ బెడ్ రూములు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి ముక్కె రరామస్వామి మాట్లాడుతూ పోటీలలో పాల్గొనడాని కి ముందుకు వచ్చిన శ్రామిక మహిళలకు సంక్రాంతి శుభాకాంక్షలు ముందస్తుగా తెలియజేశారు. మహి ళలు వంటింటికి పరిమితం కాకుండా ఆటలు పాటలు ముగ్గుల పోటీలలో నైపుణ్యాన్ని ప్రదర్శించడం శుభదాయకమని టీవీలకు సీరియల్ లకు వంటింటికి పరిమితం కాకుండా సమాజంలో ఉన్న అసమానతలను రూపుమాపడానికి ముందుకు రావడంతో పాటు చదువుల్లో రాణించి అన్ని రంగాలలో అభివద్ధి చెందాలని పిలుపునిచ్చారు. మహిళలను పుట్టనిద్దాం వారిని గౌరవిద్దాం, వారిని ఎదగనిద్దామని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గున్నాల ప్రభాకర్, సీపీఎం కరీమాబాద్ ఏరియా కన్వీనర్ మూడేళ్ల ఉపేందర్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మీరు సాజియా, ఐద్వా అధ్యక్షురాలు అప్పాజీ వాణి కార్యదర్శి మాదాసి దివ్య శ్రామిక మహిళా కార్యదర్శి ప్రవళిక ఆర్పీలు కష్ణవేణి, పద్మ ఎండి జుబేదా, మాసోబి యాకుబ్ పాషా ,మార్గం కిరణ్, రాఘవరెడ్డి, స్థానిక ఏరియా కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 8 మంది డిబార్

**నవతెలంగాణ-హసన్‌పర్తి**

కాకతీయ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో వివిధ పరీక్షా కేంద్రాల్లో 8 మంది విద్యార్థులు డిబార్ అయినట్లు కేయూ అదనపు పరీక్షల నియంత్రణ అధికారులు ఆచార్య జె.మధుకర్, డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు. ఈసందర్భంగా వారు వివరాలను వెల్లడించారు. ఆదిలాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇద్దరు, లక్సెట్టిపేట్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కరు, ఉట్నూర్ వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో ఒక్కరు, ములుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కరు, మహర్షి డిగ్రీకళాశాలలో ఒక్కరు, భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక్కరు మాల్ ప్రాక్టీసు కింద బుక్ చేసినట్టు వారు వెల్లడించారు.

## విద్యుత్ ప్రమాదంలో ఎద్దు మృతి

**నవతెలంగాణ-హసన్‌పర్తి**

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతుకు శాపంగా మారింది. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రైతు తన దుక్కిటెద్దు విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో దిగ్భ్రాంతికి గురయ్యాడు. వివరాల్లోకి వెళితే మండలంలోని అర్వపల్లి గ్రామానికి చెందిన జట్టి సారయ్య వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఎప్పటిలాగే సారయ్య తన దుక్కిటెద్దులను తీసుకొని పొలం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో పొలం వద్ద మేత మేస్తూ దుక్కిటెద్దు విద్యుత్ ట్రాన్స్‌ఫర్మర్ వైపు వెళ్లడంతో విద్యుత్ షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో రైతు లబోదిబోమంటూ గుండెలు బాదుకుంటూ బోరున విలపించడం స్థానికులను కలిచి వేసింది. దుక్కిటెద్దు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని రైతుకు జరిగిన నష్టాన్ని ఎమ్మెల్యే ఆరూరిరమేష్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని సర్పంచ్ తగరంజెన్నయ్య, టీఆర్ఎస్ ఎస్సీసెల్ అధ్యక్షుడు నగేష్‌లు రైతుకు హామీ ఇచ్చారు.



## మనఊరు-మనబడి అభివృద్ధి పనులు పరిశీలన



**నవతెలంగాణ-చెన్నారావుపేట**

మండల పరిధిలోని మన ఊరు మనబడి అభివృద్ధి పనులు జరుగుతున్న అమతండ పాఠశాలను రాష్ట్ర డైరెక్టర్ అడల్ట్ ఎడ్యుకేషన్, ఎఫ్ఎల్ఎన్ఓ, ఎంఓఎంబి పరిశీలకులు ఎస్.విజయలక్ష్మిబాయి సోమవారంపరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల ల అభివృద్ధి కి కషి చేస్తుందన్నారు. అట్టి నిధులను పాఠశాల అభివద్ధికి దోహద పడేవిదంగా స్థానిక సర్పంచ్ ప్రజా ప్రతినిధులు సమిష్టి కషితో పాఠశాలలో ఎన్ ఆర్ జి ఎస్ పనులను సర్పంచ్‌ల సహకారంతో పనులను పూర్తి చేయాలని హెచ్ఎంలకు సూచించారు. అలాగే ఈ పాఠశాలకు ప్రభుత్వం ఫర్నిచర్ సౌకర్యంలను కల్పించబోతుంది. కావున ప్రజాప్రతినిధులు కూడా పాఠశాల అభివద్ధి కి ప్రధానోపాధ్యాయులు కు సహకరించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లాసెక్టోరియల్ అధికారి వడపెల్లి సుధీర్‌బాబు, ఎంఈవో రత్నమాల, ఉపాధ్యాయుడు బానోత్ వెంకన్న, సీఆర్పీ బాలు, మెసెంజర్ యాదగిరిలు పాల్గొన్నారు.

## బల్దియా ప్రజావాణి వినతులు బుట్టదాఖలు

**నవతెలంగాణ-వరంగల్**



ప్రజావాణికి వచ్చిన వినతులు ప్రతిసోమవారం అందుకున్నప్పటికీ అధికారులు ఒక్క సమస్యకూడా పరిష్కారం కావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చే శారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కమీషనర్, వివిధ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. నేటి ప్రజావాణిలో మొత్తం 64 ఫిర్యాదులురాగా, విభాగాల వారిగా ఫిర్యా దుల వివరాలు ఇంజనీరింగ్ విభాగం 15. టౌన్ ప్లానింగ్ విభాగం 33, పన్నుల విభాగం 6, ప్రజారోగ్య, శానిటేషన్ విభాగం 4, నీటి సరఫరా విభాగం 5, ఉద్యాన వన విభాగం 1 స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ రవీందర్‌యాదవ్, ఎస్ఈలు కృష్ణారావు, ప్రవీణ్ చంద్ర, సిఎంహెచ్ఓ డాక్టర్ జ్ఞానేశ్వర్, సిహెచ్ఓ శ్రీనివాస్‌రావు, డిప్యూటీ కమీషనర్లు అనిసూర్ రషీద్, జోనా, శ్రీనివాస్‌రెడ్డి, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డిఎఫ్ఓ శంకర్‌లింగం, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుద్ఘాతంతో పూరి గుడిసె దగ్ధం

**నవతెలంగాణ-చెన్నారావుపేట**



విద్యుద్ఘాతంతో పూరి గుడిసె దగ్ధమై సుమారు రూ.6 లక్షల ఆస్తినష్టం జరిగిన సంఘటన సోమవారం మండల పరిధిలోని అక్కల్‌చెడ గ్రామంలో చోటుచేసుకుంది, స్థానికుల కథనం ప్రకారం లావుడియ దేవ్‌సింగ్, అతని భార్య నార్య, రోజువారి కూలి చేసుకుంటూ జీవనం గడిపేవారు. తనకున్న వ్యవసాయ భూమిలో పండించిన పత్తి సరైన ధర లేకపోవడంతో ఇంట్లో నిల్వ చేసుకున్నాడు కాగా వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు పోగా, ఇంట్లో ఎవరులేని సమయంలో ఒక్కసారిగా విద్యుద్ఘాతంతో గుడిసె, పత్తి దగ్ధమైనట్లు బాధితుడు రోదిస్తూ తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న బిఆర్ఎస్ యువ నాయకుడు కంది కృష్ణచైతన్య రెడ్డి వారిని పరామర్శించి ప్రభుత్వ నుండి డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## 'సెయింట్ గాబ్రియల్'విద్యార్థుల ప్రతిభ



**నవతెలంగాణ-కాజీపేట**

స్థానిక ప్లాటినం జూబ్లీ పాఠశాలలో ఐఎస్ఏఆర్‌డి-2023 ఆగాఖాన్ ఎడ్యుకేషన్ సర్వీసు ఇండియానిర్వహించిన జిల్లాస్థాయిసైన్స్‌ఫేర్‌లో సెయింట్ గాబ్రియల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటినారు. కె.మధుహాసిని, డి.స్థితప్రజ్ఞ అత్యుత్తమ ప్రతిభను కనబరచి మూడవస్థానంలో నిలిచినారు. జి రిషి ప్రీతమ్, ఎస్ సాయినాథ్, ఆర్.అనీష్‌రెడ్డి, కె.లోలిత్ సాయిరాజ్ లు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని హెచ్ఎంటీవీ కపిల్ గ్రూప్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి రంగవల్లి పోటీలలో ఎం.భువనకతి 10వ తరగతి ద్వితీయస్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా సోమవారం ఫాతిమా నగర్ దర్గా రోడ్ లోని సెయింట్ గాబ్రియల్ స్కూల్లో ప్రిన్సిపాల్ బ్రదర్ అరుణ్ ప్రకాష్, బ్రదర్ ఆంటోనీ, కరస్పాండెంట్ ప్రైమరీ ఇంచార్జి బ్రదర్ స్లీవారెడ్డిలు ప్రతిభను కనబరి చిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ చార్జీలతో నిరుద్యోగుల సతమతం

**నవతెలంగాణ-చెన్నారావుపేట**

ఆన్‌లైన్ చార్జీలను తక్షణమే తగ్గించి పేద మధ్యతరగతి విద్యార్థులకు న్యాయం చేకూర్చాలని అని ఏఐఎఫ్‌డిఎస్ వరంగల్ జిల్లా కార్యదర్శి జన్ను రమేష్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగాలకు దరఖాస్తు చేసే అభ్యర్థులు చెల్లించాల్సిన ఆన్‌లైన్‌ఫీజులను తగ్గించి వసూలుచేయాలన్నారు. ఆన్లైన్ సర్వీస్ ఛార్జీలు, నెట్ సెంటర్లో విపరీతంగా వసూల్ చేస్తున్న దీని ద్వారా పేద మధ్య తరగతి విద్యార్థులు ఈ రోజు ఆన్లైన్ చేయలేని పరిస్థితి ఏర్పడుతున్నది తక్షణమే తెలంగాణ ప్రభుత్వం పెంచిన ఆన్లైన్ ఫీజుల తగ్గించాలన్నారు.





## ప్రభుత్వ పథకాల పై అవగాహన

నవతెలంగాణ-పర్వతగిరి

మండలం లోని గుగులోత్ తండా గ్రామ పంచాయతీ పరిదిలో సోమవారం 100 ఓట్ల సర్వే లో బాగంగా ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాల చేరుతున్నాయా...? లేదా అనే విషయం నేరుగా స్థానికుల నుండి అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించారు.పథకాలు పూర్తి స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలి అనే కత నిశ్చయంతో బి ఆర్ ఎస్ ప్రభుత్వం సర్వే కార్యక్రమం నిర్వహిస్తుందని గ్రామ ఇంచార్జి గూడ నరేందర్ వర్మ తెలిపారు.అనంతరం ఆయనకు సర్వే పత్రాలను గుగులోత్ తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు మూడు రవి, గ్రామ ఉప సర్పంచ్ అన్నమయ్య లు అందజేశారు.ఈ కార్యక్రమంలో యూత్ నాయకులు,స్థానికులు పాల్గొన్నారు.

## కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి : దొంతి



నవతెలంగాణ-నల్లబెల్లి

మండల కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో సోమవారం కాంగ్రెస్ మండల పార్టీ విస్తతస్థాయి సమావేశం నిర్వహించి నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరై నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా చిట్యాల తిరుపతి రెడ్డి రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని. ప్రధాన కార్యదర్శిగా ఛార్ల శివారెడ్డి, కార్యనిర్వహణ అధ్యక్షునిగా వైనాల అశోక్ ఇస్తారు శేఖర్ గౌడ్ ఉపాధ్యక్షుడిగా పెంతల కొమరారెడ్డి మాలోతు మోహన్ సహాయ కార్యదర్శులుగా జెట్టి రామ్మూర్తి మామిండ్ల కొమురయ్య దుంపల ఇంద్రారెడ్డి గాదే సుదర్శన్ బొట్ల మొగిలి కొలిపాక పైడి గోవింద్ రంజిత్ కార్యవర్గ సభ్యులుగా సూరినేని గోపాల్ రావు మందకష్ణ వెంగల్దాస్ గోవర్ధన్ సింగన బోయిన రమేష్ పెరుమండ్ల సదయ్య ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కాగా మండల అధ్యక్షుడు చిట్యాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మాపై నమ్మకంతో మండల పార్టీ అధ్యక్షునిగా అవకాశం ఇచ్చిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కాంగ్రెస్ పార్టీ మండలంలో అభివృద్ధి చెందే విధంగా కార్యక్రమాలు నిర్వహించి దొంతి మాధవరెడ్డి నాయకత్వాన్ని నిరూపిస్తామని అన్నారు.

ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి, పెండెం రామానంద్, నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, మాజీ నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పల్వాయి శ్రీనివాస్, నర్సంపేట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్య గౌడ్, నర్సంపేట పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, గుండ్లపాడు సర్పంచ్ కదురి గట్టయ్య మేడపల్లి ఎంపీటీసీ మాలోతు అంజలి మోహన్, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు చెల్పూరి జ్యోతి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుషోత్తం సురేష్, పార్టీ ముఖ్య నాయకులు ఇతర గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు, కమిటీ సభ్యులు, ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలో చేరిక మాజీ సర్పంచ్



నవతెలంగాణ-ఆత్మకూర్

ఆత్మకూరు మండలం నీరుకుళ్ల కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ బండిసాంబయ్య సోమవారం పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో సర్పంచ్ అర్షం బలరాం ఆధ్వర్యంలో బీ ఆర్ ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన బండి సాంబయ్యను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సాదరంగా ఆహ్వానించి గులాబీ కండువాను కప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లేతాకుల సంజీవరెడ్డి,జిల్లా రెడ్ క్రాస్ డైరెక్టర్ దుంపల్లపల్లి బుచ్చిరెడ్డి, ఎంపీపీ మార్క సుమలత, జడ్పీటీసీ కక్కెర్ల రాధికారాజు, గూడెప్పాడ్ మార్కెట్ చైర్మెన్ బొల్లోబోయిన రవియాదవ్, బీఆర్ఎస్ గ్రామపార్టీ అధ్యక్షుడు మానగాని సాంబమూర్తి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బొల్లోజు కుమారస్వామి, ఎంపీటీసీ అర్షం వరుణ్ గాంధీ , బీఆర్ఎస్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అర్షం మధుకర్, మండల ఎస్సీసెల్ ప్రచార కార్యదర్శి అర్షం రాజేందర్, గూడెప్పాడ్ మార్కెట్ డైరెక్టర్ కాకాని శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## గణపతి పరపతి సంఘం వార్షిక సమావేశం

నవతెలంగాణ-కాశిబుగ్గ

శ్రీ రత్నగర్భ గణపతి పరపతి సంఘం వార్షిక సమావేశం సోమవారం వెంకట్రామ జంక్షన్ సమీపంలోని దయానంద కాలనీలో నిర్వహించారు. ఈసందర్భంగా పరపతి సంఘం అధ్యక్షుడు మీసాల ప్రకాష్ మాట్లాడుతూ పరపతి సంఘాల ద్వారా సభ్యులు ఆర్థిక అభివృద్ధి సాధించాలని కోరారు. గణపతి పరపతి సంఘం గత ఐదేళ్లుగాదినదినం అభివద్ధి చెందడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సంఘం కార్యదర్శి కొత్తపల్లి గ్లాడిస్టొన్ సంగం వార్షిక నివేదికను ప్రవేశపెట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో సీనియర్ సభ్యుడు పెంచలయ్య సంఘానికి కుర్చీలను బహుకరించగా సంఘం సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారులు దేవసాని శ్రీనివాస్, బాలరాజ్ కార్యవర్గ సభ్యులు రాంబాబు, సురేష్, శ్రీనివాస్, శారదపాల్గొన్నారు.

## ఏజీఎఫ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు...



నవతెలంగాణ-వర్ధన్నపేట

సంక్రాంతి సంబరాలలో భాగంగా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోనీ రామలీల మైదానంలో ఆరూరి గట్టుమల్లు మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మున్సిపల్ చైర్పర్సన్ ఆంగోత్ అరుణ, కౌన్సిలర్ తోటకూర రాజమణి, పాలకుర్తి సుజాత లు పాల్గొని ముగ్గులను పరిశీలించారు. రామలీల మైదాన ఆవరణలో మహిళలకు ముగ్గుల పోటీలు రన్నింగ్, కుర్చీ పోటీలు నిర్వహించారు. ఈ విజేతలకు సంక్రాంతి సందర్భంగా ఎమ్మెల్యే ఆరూరి రమేష్ చేతులమీదుగా బహుమతులు అందజేస్తామని వారు తెలిపారు.

## బాధిత కుటుంబానికి మాజీ జెడ్పీటీసీ పరామర్శ

నవతెలంగాణ-పర్వతగిరి

మండల కేంద్రంలో సోమవారం బి ఆర్ ఎస్ నాయకుడు కొండా వెంకటేశ్వర్లు తండ్రి కొండా చంద్రయ్య సోమవారం ఆకస్మికంగా మతి చెందగా మాజీ జెడ్పీటీసీ మేడిశెట్టి రాములు భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం వెంకటేశ్వర్లు ను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి పంతులు,జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ సర్వర్,గోనె సంపత్,ఏకాంతం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బీవీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షునిగా మొహమ్మద్ షరీఫ్



నవతెలంగాణ-వర్ధన్నపేట

భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి వరంగల్ జిల్లా అధ్యక్షునిగా మొహమ్మద్ షరీఫ్ ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ సోమవారం తెలిపారు. భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి వరంగల్ జిల్లా అధ్యక్షునిగా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామానికి మొహమ్మద్ షరీఫ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షునిగా ఎన్నికైన మొహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షునిగా నియమించిన భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేష్ కు కతజ్ఞతలు తెలిపారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు గిద్దె రాజేశ్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వారి ఆదేశాల మేరకు నడుచుకుంటూ వరంగల్ జిల్లాలో భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి బలోపేతానికి శక్తివంచన లేకుండా కషి చేస్తానని తెలిపారు. త్వరలో జిల్లాలోని అన్ని మండలాల్లో నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేస్తానని తెలిపారు.

# దళితుల భూముల ఆక్రమణపై నిరసన



నవతెలంగాణ-పర్వతగిరి

మండలం లోని అన్నారం షరీఫ్ లో సోమవారం దళిత, కుల సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పొడేటి దయాకర్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ హయాంలో దళితులకు కొంత భూమి ఇచ్చారు. ఆ భూమిని దళితులు ఏళ్లతరబడి వ్యవసాయం చేసుకుంటున్నారన్నారు. అదేక్రమంలో ఆ భూమికి ఆనుకుని ఉన్న కూరపాటి సోమయ్యకు దళితుల భూమిపై కన్ను పడింది. వెంటనే ధన బలంతో ఎవరికి తెలియకుండా ఆక్రమించుకొని కూరపాటి సోమన్న ఇతరులు ఆక్రమించుకోగా అట్టి భూమి దళితులు సొంతం చేసుకొని గుడారాలు నిర్మించుకోవడం జరిగిందన్నారు. భూ అక్రమదారునిపై చట్టపరమైన చర్యలు తీసుకొని దళిత కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. ఈ భూమిని తిరిగి దళితులకు వచ్చేవరకు తమ ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమానికి కెవిపిఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో భూ సంరక్షణ కమిటీ సభ్యులు నకరికంటి రామచంద్రు, గడ్డం యాకాంబరం, ఆబర్ల రాజు, పసునూరి మహేందర్, ఆబర్ల యాకరాజు, కొండేటి మహేందర్,పసునూరివినోద్, యనమలరాజు తదితరులు పాల్గొన్నారు.

# పాతపద్ధతిలో పోలీస్ నియామకాలు చేపట్టాలి : డివైఎఫ్ఐ



నవతెలంగాణ-మట్టెవాడ

రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పోలీస్ విభాగంలో నియామకాలు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పోలీసు నియామకాలను చేపట్టి నిరోద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మారపు సాంబమూర్తి అన్నారు. తిమ్మాపురం శివారులో ఏర్పాటు చేసిన డివైఎఫ్ఐ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పోలీసు నియమకాలను డిజిటలైజేషన్ పద్దతిలో కొలుస్తూ గతంలో మ్యానువల్ పద్ధతిలో క్వాలిఫై అయినటువంటి అభ్యర్థులు డిజిటలైజేషన్ ద్వారా కొలతలు తీసుకోవడం ద్వారా డిస్‌క్వాలిఫై అవుతున్నటువంటి పరిస్థితి కనబడుతోందని నిజంగా న్యాయం జరగాలంటే మరల మ్యాన్యువల్ పద్ధతిలోనే కొలతలు తీసుకోవాలని అదేవిధంగా 800 ,1600 మీటర్లు క్వాలిఫై అయినటువంటి అభ్యర్థులను మెయిన్స్‌కి అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అస్తవ్యస్తమైన నియామకాల వల్ల ఎంతోమంది యువకులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడుతున్నారని, రెండు రోజుల క్రితమే వరంగల్ జిల్లా సింగార ప్రాంతంనికి చెందిన రాజ్ కుమార్ అనే వ్యక్తి కూడా తన ప్రాణాలను కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. యువకులు అనేకమంది తమ ప్రాణాలను కోల్పోతున్న ఎటువంటి చలనం లేనటువంటి రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తుందని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సమస్యపరిష్కారానికి కషి చేయాలని రాష్ట్రప్రజాసంఘాల పిలుపులో భాగంగా హైదరాబాద్ ప్రగతి భవన్‌ని ముట్టడి కార్యక్రమాన్ని చేపటగ అడ్డుకునే ప్రయత్నంలో నిన్న రాత్రి నుండే అన్ని జిల్లా కేంద్రాల్లో ఉన్నటువంటి ప్రజాసంఘాల నాయకు లు, కార్యకర్తలను ఎక్కడికక్కడే అరెస్టులు చేస్తూఉ ద్యమాలను ఆపే ప్రయత్నం చేస్తున్నారని ప్రభుత్వం ఎన్ని పన్నాగాలుపన్నినా ఉద్యమాలను ఉధృతం చేస్తు ప్రగతిభవన్ ముట్టడిని విజయవంతం చేస్తామన్నారు. అక్రమంగా అరెస్టులు చేసి గోషామహల్ పోలీస్ స్టేషన్‌కి తరలించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో నిరుద్యోగులు అందరిని కలుపుకొని పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మామనూరి అనూష, తాళ్లపల్లి అరుణ, మహమ్మద్ రజియా, తాత స్వాతి, నలగంటి రజిని, పూజ, సతీష్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# కాపర్ తీగల దొంగల అరెస్టు : ఏసీపీ



నవతెలంగాణ-ధర్మసాగర్

గత నాలుగు నెలలుగా వరుసగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్ తీగలను దొంగతనం చేస్తున్న దొంగల ముఠాలను అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోనల్ డీసీపీ ఎన్.అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణంలో కాజీపేట ఏసిపి పి.శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ కేసు పూర్వపరాలను వెల్లడించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ రేట్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాలలో గత నాలుగు నెలలుగా వరుసగా విద్యుత్ ట్రాన్సుర్లను ధ్వంసం చేసి, అందులోని కాపర్‌తీగలను దొంగతనం చేస్తుండడంతో రైతాంగం కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో పలువురు రైతులు దొంగతనాలను నివారించి తమకు న్యాయం చేయాలని వరంగల్ సీపీ రంగనాథ్, తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. దీంతో హసన్‌పర్తి సిఐ నరేందర్, ధర్మసాగర్ సిఐ ఒంటేరు రమేష్, మడికొండ సీఐ వేణు, ధర్మసాగర్ ఎస్ఐ సాయిబాబుల ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, ప్రత్యేక టీంగా సమాచారాన్ని సేకరించడం జరిగిందన్నారు. అట్టి సమాచారం మేరకు స్థానిక సీఐ ఒంటేరు రమేష్ వారి మిగతా సిబ్బందితో బుధవారం ఉదయం 6:30 గంటల సమయంలో రాంపూర్ క్రాస్ రోడ్ వద్ద తనిఖీలు ముమ్మరం చేయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో అనుమానస్పదంగా అయినవోలుమండలం కొండపర్తి గ్రామాలకు చెందిన నీరేటి రాకేష్, మోతి సారంగపాణి, హనంకొండ మండలం దర్గా కాజీపేట ఇందిరానగర్ ప్రాంతాలకు చెందిన కళ్లెం శివ, పాస్తం శ్రీకాంత్‌లు ఈ నలుగురు వ్యక్తులు తెల్ల సంచుల్లో సుమారు 90 కేజీల కాపర్ వైర్ తీగలను ట్రాలీలో తరలిస్తుండగా వారిని పట్టుకుని విచారించడం జరిగిందని తెలిపారు. వారు ఔటర్ రింగ్ రోడ్ కి దగ్గర్లోని రాంపూర్, దేవన్నపేట, కోమటి పల్లి, మల్యాపూర్ గ్రామాల పరిధిలోని ట్రాన్సూర్మర్ల లోని కాపర్ వైర్లు తీగలను దొంగతనాలు చేసి, అమ్ముకోవడానికి వెళ్తున్నామని చెప్పడంతో వారిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

వారి విచారణలో వారి తో పాటు మరో ఇద్దరు కాజీపేట మండలంలోని దర్గా కాజీపేట ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన తూర్పాటి అరుణ్, అదే ప్రాంతానికి చెందిన గంధం పట్టాభిలు కూడా మాతో కలిసి కాపర్ వైర్ దొంగతనాలకు పాల్పడతారని చెప్పడంతో హుటా హుటిన వారిని కూడా అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న దొంగసొత్తు 20 కేజీల కాపర్ వైర్ ని స్వాధీన పరచుకోవడం జరిగిందని తెలిపారు.

11 పోలీస్ స్టేషన్లలో కాపర్ వైరు దొంగతనాలు జరిగాయని ఫిర్యాదులు ఉన్నాయి. వీరు19సార్లు దొంగతనానికి పాల్పడగా 30 ట్రాన్సూర్మర్ల లో సుమారు 924 కేజీల కాపర్ వైర్ దొంగిలించినట్లు ఒప్పుకున్నారని తెలిపారు.దొంగిలించిన సొత్తును పాత ఇనుప సామాను కొనుగోలు చేసే వ్యక్తులు కాజీపేట మండలం దర్గా కాజీపేట ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన తూర్పాటి సమ్మయ్య, హనుమ కొండ మండలం గుండ్ల సింగారం ఇందిర మ్మ కాలనీకి చెందిన ఊర సాంబ, వరంగల్ కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన భాష బోయిన పోశాలు, హసన్పర్తి మండలం పాశం రవి కాలనీకి చెందిన మోటం రాజయ్య, వరంగల్ కరీంబాద్‌కు చెందిన చారిత్రబోయిన చంద్రమౌళి విరి ఇ రువురులకు అమ్మి వచ్చిన సొమ్ము అందరు పంచుకొని, మద్యం తాగి, జల్సా చేసేవారని ఒప్పుకోవడం జరిగింది. వీరు వద్ద నుండి సుమారు 924 కేజీల కాపర్ వైర్ తీగలను స్వాధీన పంచుకో ఉన్నామని, వాటి విలువ సుమారు రూ.13,23, 500 లు ఉంటుందని చెప్పారు. వీరందరూ పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఈ కేసును తక్కువ సమయంలో చేధించడానికి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసిన కాజీపేట ఏసిపి శ్రీనివాస్‌ను కేసు చేధనలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచిన సీఐలు ఒంటేరు రమేష్, నరేందర్, వేణు, ఎస్సై ఎన్.సాయిబాబా, బృందం సభ్యులను ప్రత్యేక అవార్డులను ఇచ్చి అభినందించారు.

# దర్జాగా బోడగుట్ట కబ్జా - మట్టిదందాను పట్టించుకోని అధికారులు




నవతెలంగాణ-పర్వతగిరి

మండలంలోని ఏ బి తండా గ్రామపంచాయతీ శివారులోని ఉట్టి తండా శివారు బోటికాడి తండ బోడగుట్టను కొందరు అక్రమంగా కబ్జా చేస్తూ అక్కడున్న మట్టిని అమ్ముకుంటున్నారు. దాదాపు 18 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బోడగుట్టకు ప్రభుత్వం హద్దులు నిర్ణయించకపోవడం,చాలా దారుణం అక్కడున్న ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతున్న స్థానిక తహసిల్దార్ పట్టించుకోకపోవడం చాలా దారుణం మని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇదే తంతుగా పర్వత గిరి రిజర్వాయర్ లో ఘోరంగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నా... అధికారులు మాత్రం మా కెందుకులే అంటూ తమకు వచ్చే ఆమ్యామ్యాల మీద ఆధారపడి అక్రమార్కుల నుండి పెద్ద మొత్తం లోనే చేతివాటం పొందారని విమర్శలు మండలం లో చర్చనీయాంశం గా,ప్రజలనుండి తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. అయినా అధికారులు మామూళ్ల మత్తులో తేలియాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిద్ర లేచి వెంటనే స్పందించి అన్యాక్రాంతం అవుతున్న భూములను,ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని ప్రజలు, తండావాసులు కోరుతున్నారు.

## చైన్స్ స్నాచర్స్ అరెస్టు : బంగారు ఆభరణాలు స్వాధీనం



నవతెలంగాణ-కాజీపేట

రైలలో నిద్రిస్తున్న మహిళల ప్రయాణికుల వద్ద బంగారు ఆభరణాలు దొంగలించకపోతున్న చైన్స్ స్నాచర్స్ ను అరెస్ట్ చేసినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. వారు తెలిపిన పూర్తి వివరాల మేరకు సోమవారం సాయంత్రం నమ్మదగిన సమాచారం మేరకు వరంగల్ జిఆర్పి ఎస్ఐ సిహెచ్ పరశురాములు, జిఆర్పి సిబ్బంది రాము రియాజ్ , సికింద్రాబాద్ సిఐబి ఏఎస్ఐ రామకష్ణ, కాజీపేట సిఐబి రమేష్, కాజీపేట ఆర్పిఎఫ్ మనోజ్ కుమార్, వరంగల్ ఆర్పిఎఫ్ సిబ్బంది రాజు లు వరంగల్ రైల్వే స్టేషన్ ప్లాట్ఫారం నెంబర్ 2 ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించగా అట్టి వ్యక్తులను విచారించగా వారు పేర్లు దీపక్ సింగ్ రాజా బత్ 22, మధ్యప్రదేశ్, అతుల్ సింగ్ 23 ఉత్తర ప్రదేశ్ కి చెందిన వారిగా గుర్తించినట్లు వారిని తనిఖీ చేయగా వారి వద్ద బంగారు పుస్తెలు, నల్లపూసలతాడు, బంగారు గొలుసు అందాజా ఆరున్నర తులాలు లభ్యమైనట్లు తెలిపారు. బంగారు ఆభరణాలను మణుగూరు ఎక్స్ప్రెస్, ఇంటర్సిటీ, గోల్కొండ, చార్మినార్ ఎక్స్ప్రెస్ ల నందు నిద్రిస్తున్న మహిళా ప్రయాణికురాలి మెడలలో నుండి దొంగిలించినవిగా, వారి విలువ సుమారు మూడున్నర లక్షలు ఉంటుందన్నారు. స్వాధీన పంచనామా ద్వారా బంగారు వస్తువులను స్వాధీన పరుచుకోని నిందితులను రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు తెలిపారు. నిందితులు పేకాట, చెడు వ్యసనాలకు బానిసలై సులువుగా డబ్బు సంపాదించాలని దురాశతో రైళ్లలో ప్రయాణికుల వద్ద బంగారు ఆభరణాలను దొంగలిస్తున్నట్లు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-ఆత్మకూరు

మంగళవారం మండలంలోని ఆత్మకూరు, తిరుమలగిరి, హౌజ్ బుజుర్గ్, కటాక్షపూర్, మల్కపేట, కోత్తగట్టు, గుడెప్పాడ్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఆధునీకరణలో భాగంగా విద్యుత్ సరఫరాకు కు అంతరాయం కలుగుతుందని తెలిపారు వినియోగదారులు సహకరించాలన్నారు.

## ఎలుకుర్తి దళితుల భూములను రక్షించాలి



నవతెలంగాణ-సుబేదారి

ఎలుకుర్తి దళితుల భూములను రక్షించాలని డివియంసి సభ్యులు పుట్ట రవి,చుంచు రాజేందర్, రవిప్రసాద్ రామచందర్ రావు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాం ధీ హనుమంతుకు కలిసి భూ బాధితుల వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ భూములుపోతే మేము ఎట్లా బ్రతకాలి దళిత రైతుల ఆవేదన అర్థం చేసుకొని ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోని నిరుపేదలకు న్యా యం చేయాలన్నారు. ధర్మసాగర్ మండలం ఎల్కూర్తి గ్రామంలో 1976 సంవ త్సరంలో సర్వే నెంబర్ 160 లో స్వర్గీయ ఇందిరాగాంధీ హయాంలో యాబై కుటుంబాలకు 54 ఎకరాల వ్యవసాయ సాగు భూమిని పంపిణీ చేసింది. నాటి నుండి నేటి వరకు దళిత కుటుంబాలు భూమిని సాగుచేసుకుం టు పంటలు పండిస్తూ బ్రతుకుతున్న తరుణంలో ఇప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం అట్టి భూమిలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కోసం యాబై నాలుగు ఎకరాల దళిత రైతుల భూములను బలవంతంగా లాక్కొని హైదరాబాదు పబ్లిక్ స్కూల్ యాజమాన్యంకు అప్పగిస్తుంది. 2016 లో అప్పటి ఆర్డీవో, తహసిల్దార్ వారు భూమిని సేకరణ చేయడానికి ప్రయత్నించి, నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పి మాయమాటలు చెప్పి 2022లో భూమి చుట్టు కంచేవేసి భూమిని లాక్కొనే ప్రయత్నం చేయడం విడ్డూరమన్నారు. అమాయకులైన, నిరక్షరాస్యులైన దళిత కుటుంబాలతో బలవంతంగా ఖాళీ పేపర్ ల మీదా సంతకాలు చేయించుకోని భూములను అమ్మినట్లు కాగితాలు సష్టించి పేద దళిత రైతులను భూములనుండి దూరం చేసే కుట్రలు చేస్తుందని, ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భూములు పోతే మేము ఎట్లా బ్రతకాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పరిశీలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యులు పుట్ట రవి మాదిగ ,చుంచు రాజేందర్,సింగారపు రవి ప్రసాద్, జాతీయ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అంకేశ్వరపు రాంచందర్ రావు, అసైన్డ్ భూమి సమితి రాష్ట్ర అధ్యక్షులు కలకోటి మహేందర్, డిబిఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదాసి సురేష్, నాయకులు మైబు, రాజేష్, నరేష్, ఎల్కూర్తి గ్రామ దళిత బాధితులు అబ్రహం, కనకం ఇబ్రాయిల్, సుదర్శన్, చాగంటి స్వామి, ఇంద రమేష్, జోగు సాంబయ్య సంద్ర సుధాకర్, నర్సమ్మసలోచన,రాధ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు : సిపిఎం

నవతెలంగాణ-ఐనవోలు

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్నీ ఆపలేరని సీపీఎం హన్మకొండ కమిటీ సభ్యులు, మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య, మండల కమిటీ సభ్యులు, ములకలగూడెం సర్పంచి బండి పర్వతాలు, కే నారాయణరెడ్డి,గుండెకారి మహేందర్, దీకొండ ఉప్పలయ్య అన్నారు.సోమవారం పోలీస్ రిక్రూట్ మెంట్ లో జరిగిన అవకతవకలు అరికట్టాలని, పాత పద్ధతిలోనే రిక్రూట్మెంట్ కొనసాగించాలని నేడు చలో ప్రగతిభవన్ ముట్టడి కార్యక్రమం సందర్భంగా ఐనవోలు మండల డివైఎఫ్ఐ కార్యకర్తలను దద్దురాజును అర్ధరాత్రి అరెస్ట్ చేయడం సరికాదన్నారు.అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు.పోలీస్ రిక్రూట్మెంట్ లో అన్యాయం జరిగినటువంటి ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేంతవరకు యువతకు అండగా ఉండి వారి పోరాటాలకు మద్దతు ఇస్తామన్నారు.

## ఒలంపియాడ్ విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-కాజీపేట

సైన్స్ ఒలంపియాడ్ ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలంపియాడ్లో కాజీపేట నందుగల తాళ్ల పద్మావతి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో బిరియా, సిహెచ్ అధ్య మూడో స్థానం, హర్షిని, హనీష్ 7,8 ర్యాంకులతో పాటు జనరల్ స్థాయిలో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారు. తన్విష్ సాయి, అనూష, స్వరనీ రాజ్, నిగ్నేషిత జాతీయస్థాయి పరీక్షలకు అర్హత సాధించిన సందర్భంగా విద్యార్థులను తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం బహుమతులు ప్రధానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల స్థాపించిన కొద్దికాలంలోనే విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో రాణించడం అభినందించే విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు తాళ్ల వంశీ, తళ్ల చైతన్య, శ్రావణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, మహేందర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం



నవతెలంగాణ-ఐనవోలు

భారతీయ తొలి మహిళా ఉపాధ్యాయురాలు క్రాంతిజ్యోతి సావిత్రిబాయి పూలే 192 వ జయంతి సందర్భంగా టిఎస్ యుటిఎఫ్ హన్మకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని అవార్డుల ప్రదానోత్సవంలో భాగంగా ఐనవోలు మండలం నుండి కే.పద్మలత ఎస్‌జిటి, ఎంపీపీఎస్ కక్కిరాలపల్లి, సునీత ఎస్ ఓ, కేజీబీవీ ఐనవోలు, బి.శ్వేత పీజీటీ, ఎంజేపీ ఐనవోలు ఉత్తమ ఉపాధ్యాయినీలుగా అవార్డులందు కున్నారు. ఈ సందర్భంగా వారికి తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ టీఎస్ యుటిఎఫ్ ఐనవోలు మండల శాఖ తరఫున మండల అధ్యక్షులు ఏ.రవీందర్, ప్రధాన కార్యదర్శి బి.బ్రహ్మచారి, జిల్లా కార్యదర్శి సిఎస్ఆర్ మల్లిక్, హనుమకొండ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చుంచుకాల లింగారావు అభినందించారు.

## సీసీ కెమెరాలు ప్రారంభించిన ఏసీపీ

నవతెలంగాణ-నల్లబెల్లి

మండలంలోని రుద్రగూడెం గ్రామంలో సోమవారం స్థానిక ఎస్సై రాజారాం ఆధ్వర్యంలో నిర్వహించిన నిఘా నేత్రాలపై అవగాహన సదస్సుకు నర్సంపేట ఏసిపి సంపత్ రావు, రూరల్ సీఐ సూర్యప్రసాద్ పాల్గొని నిఘా నేత్రాల ఉపయోగం గురించి తెలిపి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, వైస్ ఎంపీపీ గందే శ్రీలత శ్రీనివాస్ గుప్తా, వార్డు సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని లెంకాలపల్లి, నందిగామ గ్రామాలలో గ్రామస్తులు, గ్రామ పాలకమండలి ఏర్పాటు చేసుకున్న నిఘా నేత్రాలను (సీసీ కెమెరాలు) శుక్రవారం నర్సంపేట ఏసీపి సంపత్ రావు, రూరల్ సీఐ సూర్యప్రసాద్, స్థానిక ఎస్సై రాజారాం ప్రారంభించారు. గ్రామ పోలీస్ అధికారి ఆకుల రవీందర్‌ను ఏసీపి సంపత్ రావు, ప్రజలు అభినందించి జ్ఞాపకణలు అందించారు. ఈ కార్యక్రమంలో లింకాలపల్లి సర్పంచ్ సాంబలక్ష్మి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, సాంబయ్య, వార్డు సభ్యులు, నందిగామ గ్రామ సర్పంచ్ సలేంద్ర నాగేశ్వరరావు, ఉపసర్పంచ్, వార్డుసభ్యులు,అభివద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-వేలేరు

మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో సర్పంచ్ గూడ కవిత రాజ్ కుమార్, గ్రామ పంచాయితీ పాలకవర్గం ఆధ్వర్యంలో సిసి రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గూడ కవిత రాజ్ కుమార్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ సహకారంతో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో సీసిరోడ్లు, బిటి రోడ్డు పనులను పాలకవర్గం తరుపున పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అల్లం సతీష్ ,వార్డు సభ్యులు గుత్పల కల్పన, చిలుక భాస్కర్, తెరాస గ్రామ శాఖ అధ్యక్షులు గుత్పల సతీష్, ఎల దుర్గయ్య, ఎర్ర మొగిలయ్య, ఎడ్ల కుమారస్వామి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీస్తు బోధనలు ఆదర్శనీయం : రెవ.పాల్సన్‌రాజ్



నవతెలంగాణ-కాశిబుగ్గ

యేసుక్రీస్తు బోధనలు కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరికి ఆదర్శనీయమని ప్రవక్త రెవరెండ్ డాక్టర్ సంగల పాల్సన్‌రాజ్ అన్నారు. 14వ డివిజన్ పరిధిలోని ఎస్సార్ నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన గేత్సమనే ప్రార్థన మందిరాన్ని సో మవారం ప్రవక్త రెవ. డాక్టర్ జయ ప్రకాష్ తో కలిసి పాల్సన్ రాజ్ ప్రారంభిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రజలను పాపాల బారి నుండి రక్షించేందుకు ఏసుక్రీస్తు తన ప్రాణాలనే త్యాగం చేశారని గుర్తు చేశారు. ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఏసుక్రీస్తు చూపిన బాట లో పయనించాలని పిలుపునిచ్చారు. గేత్సమనే ప్రార్థనమందిరం ప్రారంభానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రవక్తలు పాల్సన్ రాజ్, జయప్రకాష్ లను పాస్టర్ ఆరోగ్య రాజ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు, ప్రజలు కాశిబుగ్గ నుండి ఎస్సార్ నగర్ వరకు డప్పు చప్పులతో, కోలాటనత్యాలతో భారీ ర్యాలీగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ తూర్పాటి సులోచన సారయ్య డివిజన్ అధ్యక్షుడు ముడుసు నరసింహ జిల్లా నాయకులు కేతిరి రాజశేఖర్, భూక్య మోతిలాల్ నాయక్, శాఖ అధ్యక్షుడు పసులాది మల్లయ్య నాయకులు మచ్చర్ల స్టాలిన్, ఎం ఎస్ పి వరంగల్ తూర్పు ఇంచార్జ్ ఈర్ల కుమార్, ఎన్టీఆర్ నగర్ శాఖ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్, గూడూరు కష్ణ, యూసఫ్, బబ్లు, చోటు, తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి స్నేహితుల ఆర్థిక సహాయం



నవతెలంగాణ-చెన్నారావుపేట


మండల పరిధిలో లింగగిరి గ్రామంలో గత వారం రోజుల క్రితం హత్యగురై మరణించిన జంగిలి పెద్దరాజు కుటుంబాన్ని సౌత్ ఇండియన్ టూర్ చిట్టి సభ్యులు, మతుని ఇద్దరి కూతుర్లను పరామర్శించి రూ.20 వేల ఆర్థిక సాయం సోమవారం అందజేశారు. అనంతరం సర్పంచ్ మాదారపు భాస్కర్ మాట్లాడుతూ, అన్ని బంధాల కన్నా స్నేహబంధం గొప్పదని మృతుని కుటుంబ సభ్యులకు ధైర్యం నింపి ఎల్లప్పుడు మేము తోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ సొసైటీ సభ్యులు మల్లం సాగర్, నాంపల్లి శ్రీనివాస్, సప్పిడి శ్యామ్, బూరుగు సుధాకర్, వేమ్ముల రవికుమార్, కుసుమ శ్రీనివాస్, సతీష్ కుమార్ స్వామి, చిట్టి సభ్యులు తోటి మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ చాంపియన్‌షిప్‌లో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-హసన్‌పర్తి

కాకతీయ విశ్వవిద్యాలయం ఇండోర్ స్టేడియంలో సిటోరియో అకాడమి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2023 పోటీల్లో విద్యార్థులు అత్యంత ప్రతిభనుకనబర్చి బహుమతులు సాధించినట్లు సిటోరియా అకాడమి నిర్వాహకులు సియాన్ పాపయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 సంవత్సరాల కటాస్ విభాగంలో ఎల్లాపూర్ చోటోకాస్ కరాటే విభాగంలో టి.విషితరెడ్డి, డి.హరీష్‌లు సిల్వర్ మెడల్, వి.సాయిహర్షిని, ప్రజ్ఞశ్రీ, రన్వి, టి.మహీదర్‌రెడ్డిలు బ్రాంజ్ మెడల్‌లు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ ఎస్ఎస్‌కాయ్ ఎన్.సదానందం, ఎల్లాపూర్ మాస్టర్ రేణుకుంట్ల దుర్గాప్రసాద్‌లను అభినందించారు.

నవతెలంగాణ







# మానుకోట అభివృద్ధి తెలంగాణ ప్రభుత్వానిదే : ఎమ్మెల్యే శంకర్ నాయక్



**నవతెలంగాణ-మహబూబాబాద్**

మానుకోట పట్టణ రూపు రేఖలు మార్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే అని తనచివరి శ్వాస వరకు మానుకోట ప్రజలతోనే ప్రయాణం అని ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శంకర్ నాయక్ మాట్లాడారు మహబూబాబాద్ రూపురేఖలు మారాయిఅంటే అది సీఎం కేసీఆర్ వల్లే అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం రాకుంటే లేకుంటే ఇరుకైన రోడ్లు, ప్రజల జీవితం అయోమయంగా ఉండేదన్నారు. మానుకోట జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయడం, మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాల, 300 బెడెడ్ హాస్పటల్ తెచ్చి లక్షల వైద్యం పేదోని ఇంటి ముందుకు ఘనత కేసిఆర్ దే అన్నారు. మానుకోట నా అభివృద్ధి పథంలో నడిపించుటకు వెనుక నా కష్టం నష్టం ఎంతో ఉంది అన్నారు. ఎన్ని అవమానాలు, ఎన్నిఅవరోధాలు అన్నిటినీ భరించాను అన్నారు. శంకర్ నాయక్ ఎక్కడ తగ్గలేదని, శంకర్ నాయక్ చచ్చుడో జిల్లా వచ్చుడో అనే నినాదం తోటి ప్రజల శ్రేయస్సు ముఖ్యం అని నేను రాష్ట్రంలో మొదటిసారి ర్యాలీ తీసా అన్నారు. జీవితములో ఎన్నో పొందాను ఎన్నో పోగొట్టుకున్నాను, ఎమ్మెల్యే పదవి నాకు ముఖ్యం కాదు అని ప్రజలు వారి సంతోషం, సౌఖ్యం సంక్షేమం ముఖ్యమని అన్నారు.ఒకప్పటి మానుకోట పట్టణం ఇప్పటి మానుకోట పట్టణాన్ని చూస్తే ఇతర ప్రాంతాల్లో నుంచి వచ్చిన వారు గుర్తుపట్టలేనంతగా అభివృద్ధి చెందిందన్నారు. మహబూబాబాద్ అభివృద్ధి కోసం ఎన్నో నిధులు ఇవ్వడానికి ఇంకా అభివృద్ధి చేయడానికి నేను సిద్ధం అన్నారు. ప్రతి కార్యకర్త సీఎం పర్యటనలో పాలుపంచు కోవాలి అన్నారు. మహబూబాబాద్ అభివృద్ధి ప్రతి ఒక్కరికి మేలు జరిగింది. ఇంత తక్కువ కాలంలో ఇంత అభివృద్ధిని గత పాలకులు ఎవరు చెయ్యలేదన్నారు. అది సీఎం కేసీఆర్ పాలనలో నాతేనే సాధ్యమైందన్నారు. ఎన్నో అద్భుతమైన నిర్మాణాలు, కళా కట్టడాల వెనుక నా శ్రమ ఎంతో ఉందన్నారు. ప్రజల కోసం ఎంతో కష్ట పడ్డానని, మానుకోట అభివృద్ధికి జీవితాంతం కష్ట పడతానని మానుకోట ప్రజల రుణం తీర్చుకునేంత వరకు వెన్నంటి ఉంటానన్నారు. సీఎం పర్యటనను విజయవంతం చేసి సీఎం కేసీఆర్‌కి కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డా.రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఎం.డి.ఫరీద్, మర్నేని వెంకన్న, సుదగని మురళి, గోగుల రాజు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



## కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**డీఆర్‌డీఓ గూడూరు రామ్ రెడ్డి**

**నవతెలంగాణ-పాలకుర్తి**

ఈనెల 18 నుండి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిఆర్డిఓ గూడూరు రామ్ రెడ్డి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో గల ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, ఐకెపి సిబ్బందికి ఏర్పాటు చేసిన కంటి వెలుగు అవగాహన కార్యక్రమంలో ఎంపీపీ నల్ల నాగిరెడ్డి తో కలిసి ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం గ్రామీణ ప్రాంత ప్రజలకు వరం లాంటిదని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమం విజయవంతం కోసం అన్ని శాఖల అధికారులు, ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఫ్లోర్ లీడర్ పుష్కురి శ్రీనివాసరావు, జిల్లా కోఆప్షన్ సభ్యులు ఎండి మదర్, ఎంపీడీవో వనపర్తి అశోక్ కుమార్, తహసిల్దార్ భూక్య పాల్ సింగ్ నాయక్, వైద్యాధికారిణి అర్చనతోపాటు ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, వైద్య, ఐకెపి సిబ్బంది పాల్గొన్నారు.

## సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య**

**నవతెలంగాణ-పెద్దవంగర**

మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో ఈ నెల 12న జరిగే ముఖ్యమంత్రి కేసీఆర్ పర్యటనను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ వెనుకదాసుల రామచంద్రయ్య శర్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సమీకృత కలెక్టరేట్, జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభంతో పాటుగా, వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాకు సీఎం కేసీఆర్ వస్తున్నందున బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిదారులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై ముఖ్యమంత్రికి అండగా నిలువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శ్రీరాం సుధీర్, శ్రీరాం సంజయ్ కుమార్, పాకనాటి సోమారెడ్డి, ముత్తినేని శ్రీనివాస్, భానోత్ వెంకన్న, కనుకుంట్ల వెంకన్న, బొమ్మరబోయిన రాజు, దుంపల సమ్మయ్య, ఏదునూరి శ్రీనివాస్, బానోత్ సోమన్న, తంగళ్ళపల్లి మల్లికార్జున చారి, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



**నవతెలంగాణ-పర్వతగిరి**

మండలంలోని గోరుగుట్ట తండా గ్రామపంచాయతీ పరిధిలో ఆదివారం తాగునీటికి కొరత లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక సర్పంచ్ బానోతు వెంకన్న నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న వేసవి కాలం దృష్ట్యా ముందస్తుగా ప్రజలకు తాగు నీటి కోసం ఏలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడుతున్నట్లు ఇందుకోసం కెనాల్ సీల్డ్ పనులు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## తాటి చెట్టుపై నుండి పడి గీత కార్మికుడికి గాయాలు

**హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న పామర్తి మల్లేష్**

**నవతెలంగాణ-మరిపెడ**

చెట్టు ఎక్కిన గీతా కార్మికుడికి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలైన సంఘటన ఎడ్జర్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. తాడిచెట్టు ఎక్కుతున్న సమయంలో తాడిచెట్టు పై నుండి మోకుజారి పడడంతో కంగారులో గీత కార్మికుడు జారిపడ్డారు. దీంతో తీవ్ర గాయాలతో అస్వస్థకు గురైన మల్లేష్‌ను హుటాహుటిన మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వం దావాఖానకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.విషయం తెలిసిన వెంటనే గీత పనివారుల సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి పోగుల శ్రీనివాస్ గౌడ్ మల్లేష్‌ను ఆసుపత్రిలో పరామర్శించారు. మల్లేష్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్య అధికారులను కోరారు. గాయాలు పాలైన గీతా కార్మికున్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీత పని వారల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొంతు రామ్మూర్తి గౌడ్, చిర్రా వెంకటేశ్వర్ల గౌడ్, గీత పారిశ్రామిక సహకార సంఘం గ్రామ సొసైటీ అధ్యక్షుడు గడ్డం బాబుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్‌యుపిపి టిఎస్ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

**నవతెలంగాణ-మహబూబాబాద్**

ఆర్‌యు పిపిటిఎస్ ఉపాధ్యాయ సంఘం నూతన క్యాలెండర్‌ను సోమవారం డీఈవో రామారావు ఆవిష్కరించారు. సంగం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మడిపెల్లి రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక శ్రీనివాస్‌లు డీఈఓను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 'రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు తెలంగాణ రాష్ట్రం' నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం సభ్యులు సభ్యులు ఆర్.సతీష్ కుమార్, కంజర్ల సంపత్, పట్ల కరుణాకర్. ఏఎస్ఓ సదయ్య, ఎసిజి శ్రీరాములు,క్వాలిటీ కోఆర్డినేటర్ బిచ్చయ్య, సిడబ్ల్యూ.ఎస్.ఎన్ కో-ఆర్డినేటర్ ముఖేష్, లింగాల సాగర్‌లు పాల్గొన్నారు.

## గోవాలో గౌడ సంఘం వార్షిక సమావేశం



**నవతెలంగాణ- తొర్రూర్ రూరల్**

గౌడ సహకార పరపతి సంఘ 18వ వార్షిక సమావేశం గోవాలో అత్యంత వైభవంగా సరదాగా నిర్వహించడం జరిగింది సంఘ అధ్యక్షులు తాళ్లపల్లి హేమాద్రి గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తి చేసుకుని రాష్ట్రాలు దాటి గోవాలో గౌడ సహకార పరపతి సంఘం వార్షిక సమావేశం నిర్వహించుకోవడం ఆనందదాయకం, గర్వకారణం అన్నారు. 18సంవత్సరాలుగా సంఘ సభ్యుల మధ్య సహకారం మరియు పరపతి పెంచుకుంటూ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించుకుంటూ పోతున్నందుకు సంఘ సభ్యులు అందరిని కూడా అభినందించారు. సంఘానికి ప్రాథమిక సభ్యులే మూల స్తంభాల లాంటి వారిని, ఇన్ని సంవత్సరాలుగా సంఘం అభివృద్ధికి కృషి చేసినటు వంటి వివిధ హెూదాలలో పని చేసిన సంఘ అధ్యక్షులకు, ప్రధాన కార్యదర్శులకు కోశాధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. వార్షిక సమావేశం గోవాలో నిర్వహించుకోవడం సభ్యుల మధ్య సమైక్యతకు నిదర్శనం అన్నారు. రాబోయే రోజుల్లో సంఘాన్ని మరింత అభివృద్ధి చేసే దిశగా అందరూ కలిసికట్టుగా ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపా డివిజన్ అధ్యక్షులు తాళ్లపల్లి రమేష్ గౌడ్, గోపా మండల అధ్యక్షులు గోవా విహార యాత్ర కో ఆర్డినేటర్ రాయిపెల్లి యాకయ్య గౌడ్ జిల్లా కార్యవర్గ సభ్యులు పెరుమాండ్ల రమేష్ గౌడ్, కొండం జనార్ధన్ గౌడ్, అనేపురం వెంకన్న గౌడ్, చిరగాని రమేష్ గౌడ్, సంఘ ప్రధాన కార్యదర్శి కొయ్యడ కుమారస్వామి గౌడ్, కోశాధికారి జలగం శ్రీనివాస్ గౌడ్, గౌడ సంఘానికి సూచనలు సలహాలు అందిస్తున్న ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు దూలం శ్రీనివాస్ గౌడ్, సలహాదారులు పెరుమాండ్ల చక్రపాణి గౌడ్, మోడెం వెంకన్నగౌడ్, తండ రామస్వామి గౌడ్ తో పాటు మొత్తం 60 మంది సభ్యులు పాల్గొన్నారు.

## అరెస్టులతో ఉద్యమాలను అడ్డుకోలేరు

**విద్యార్థుల ముందస్తు అరెస్ట్**




**నవతెలంగాణ-జనగామ**

విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేసి ఉద్యమాలను అడ్డుకోలేరని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మ భిక్షం, రాష్ట్ర నాయకులు బోడ నరేందర్‌లు అన్నారు. కానిస్టేబుల్ నియామకల్లో జరుగుతున్న అవకతవకలను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకుగాను ఎస్ఎఫ్ఐ, టీజీవీబీ విద్యార్థులను పోలీసులు సోమవారం వేకువ జామున ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు చేసిన విద్యార్థులను జనగామ పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మంభిక్షం మాట్లాడుతూ కానిస్టేబుల్ నియామకాల్లో విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. వాటిని ప్రశ్నిస్తున్న విద్యార్థులను అరెస్టులు చేయడం అప్రజాస్వామికమన్నారు. అరెస్టుల ద్వారా సమస్యలు పరిష్కారం కావన్నారు. అరెస్ట్ అయిన వారిలో ఎస్ఎఫ్ఐ, టీజీవిపి విద్యార్థి సంఘం నాయకులు ధర్మభిక్షం, బోడ నరేందర్, తుంగ కౌశిక్, వెంపటి అజయ్‌లు ఉన్నారు.

## విద్యుత్ ఘాతంతో పాడి గేదె మృతి



**నవతెలంగాణ-గార్ల**

విద్యుత్ ఘాతంతో పాడి గేదె మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం జరిగింది. రైతు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని సినిమా హాల్ బజార్‌కు చెందిన షేక్ బాజీ అనే పేద రైతుకు చెందిన పాడి గేదె మర్రి గూడెం గ్రామానికి వెళ్ళే మార్గంలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్ల సమీపంలో పాడి గేదెలను మేపుతుండగా ప్రమాదవశాత్తు వ్యవసాయ బావి వద్ద విద్యుత్ ఘాతానికి గురై చనిపోయింది. మరణించిన పాడి గేదె విలువ సుమారు 80 వేల రూపాయలు ఉంటుందని రైతు తెలిపారు.

**ప్రభుత్వం నష్టం పరిహారం చెల్లించాలి : కందునూరి శ్రీనివాస్**

విద్యుత్ ఘాతంతో చనిపోయిన పాడి గేదే యజమాని పేద రైతు షేక్ బాజీ కుటుంబాన్ని ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

## యూటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి

**జిల్లా కార్యదర్శి కందుల శ్రీనివాస్**




**నవతెలంగాణ-దేవరుప్పుల**

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) రాష్ట్ర ఐదవ మహాసభలు ఈనెల 13,14 తేదీల్లో రంగారెడ్డి జిల్లా మన్నేగూడలో నిర్వహించనున్నారు, ఈ మహాసభలకు ఈ సభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కందుల శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని కామారెడ్డి గూడెం కాంప్లెక్స్ సంబంధించిన గోడ పత్రికను మండల నోడల్ ఆఫీసర్ సిహెచ్ ఉపేందర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు ఐ.శ్రీలత ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా కార్యదర్శి కందుల శ్రీనివాస్ మాట్లాడుతూ మహాసభలలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి, కేరళ మాజీ వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కేకే శైలజ గార్లు ప్రారంభ ఉపన్యాసం చేస్తారని, విద్యావేత్త చుక్కా రామయ్య ప్రొఫెసర్ కె నాగేశ్వర్ రావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏ.నర్సిరెడ్డి తదితరులు పాల్గొంటారని తెలిపారు. జాతీయ విద్యా విధానం, సిపిఎస్ అంశం మరియు వివిధ విద్యారంగ సమస్యలపై నిర్దిష్ట పోరాట కార్యక్రమాలను రూపొందించుకోవడం జరుగుతుందని, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అ సంఘం మండల అధ్యక్షుడు ముడిదె రాము, ప్రధాన కార్యదర్శి గడిపే శ్రీనివాస్, మండల కార్యవర్గ సభ్యులు గోవర్ధన్ రెడ్డి, రాజేంద్ర ప్రసాద్ ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**మహాసభలను విజయవంతం చేయాలి : జిల్లా కార్యదర్శి చిక్కుడు శ్రీనివాస్**



**పాలకుర్తి :** సమస్యల సాధన కోసం, హక్కుల పరిరక్షణ కోసం ఈనెల 13, 14 తేదీలలో రంగారెడ్డి జిల్లా సాగర్ రోడ్‌లో గల మన్నెగూడెంలో నిర్వహించే టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి చిక్కుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్ మహిళా ఉపాధ్యక్షురాలు హేమలత తో కలిసి టీఎస్ యుటిఎఫ్ మండల అధ్యక్షుడు వీరమల్ల బాబయ్య ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 317 లో పొందుపరిచిన సమస్యలన్నింటినీ పరిష్కరించాలని, ప్రమోషన్లను వెంటనే చేపట్టాలని, బదిలీల ప్రక్రియను ప్రారంభించి, పెండింగులో ఉన్న డిఏలను అందించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కై పోరాటం యుటిఎఫ్ కే సాధ్యమన్నారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు జరిగే రాష్ట్ర మహాసభలను ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. రాష్ట్ర మహాసభలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ అలుగువేలు నర్సిరెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ చుక్క రామయ్య హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు శాగ నర్సయ్య, అకాడమిక్ సెల్స్ కన్వీనర్ తోట వెంకట్, పాలకుర్తి జిహెచ్ఎం శోభారాణి , మండల ప్రధాన కార్యదర్శి చిదురాల రమేష్, మాజీ అధ్యక్షులు డి.రాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు గుగులోతు బలరాం నాయక్, బల్లుల ఉప్పలయ్య సిహెచ్ అశోక్, వై నాగయ్య, తమ్మి మధు, గంధసిరి ప్రసాద్,వై విజయరాణి, మండల ఉపాధ్యక్షురాలు ఆర్ సరస్వతి, జయశ్రీ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



**నవతెలంగాణ-బయ్యారం**

మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ హైస్కూల్లో 1989-1990 సంవత్సరానికి చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం బయ్యారం పెద్ద చెరువు వద్ద సమావేశం నిర్వహించుకున్నారు. 32 సంవత్సరాల తర్వాత అందరు కలుసుకొని ఒకరు ఒకరు ఆప్యాయంగా పలకరించుకోవడం జరిగింది. చదువుకున్నప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని ఆనందాన్ని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో నెమలి ఎల్లయ్య, మెంతైన వసంతరావు, మునేష్, శ్రీలక్ష్మి, సైదులు, రుద్రమణి, చంద్రారెడ్డి, సుజాత, కన్నారావు, నర్సిరెడ్డి, ధనలక్ష్మి, శ్రీదేవి, రాయల శ్రీను పాల్గొన్నారు.

## కోర్టు ఏర్పాటులో తాత్సారం ఎందుకు

**కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వినోద్ కుమార్**



**నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్**

రెవెన్యూ డివిజన్ కేంద్రంలో న్యాయ సముదాయాల కోర్టు ఏర్పాటులో తాత్సారం ఎందుకో అధికార పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చేపూరి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ నియోజకవర్గ ప్రజలకు ఇబ్బందిపడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే కోర్టు ఏర్పాటు ఆవశ్యకతను తెలిసి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ స్థానిక ఎమ్మెల్యే, అధి.కార పార్టీ ప్రతినిధులు ఆలస్యం చేయకుండా వెంటనే స్పందించి, కోర్టుఏర్పాటు చేయాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీడి రాంచందర్, చేపూరి ప్రభాకర్, మారపాక వెంకటస్వామి, జీడి స్వామి, ఐలపాక సుదర్శనం, సన్నీ, బన్నీ, తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంపై ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం



**నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్**

పాఠశాల విద్యారంగ సమస్యల పరిష్కారంపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్ అన్నారు. మండలంలోని శివునిపల్లి గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంఘం 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉపాధ్యాయుల సర్వీసు, మౌలిక సదుపాయాల, విద్యార్థుల కనీస అవసరాల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కానుగంటి రంజిత్ కుమార్ విమర్శించారు. డివిజన్ కేంద్రంలో శివునిపల్లి ఉన్నత పాఠశాలలో ఆయన సంఘం 2023 వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఉపాధ్యాయుల బదిలీలులేవని, గత ఏడేళ్లుగా పదోన్నతులు లేవని, ఇప్పటికే పీఆర్సీ వేతన బకాయిల చెల్లింపులు లేవని, మెడికల్ రీ ఎంబర్స్ మెంట్ బిల్లులు వేలాదిగా పెండింగులో ఉన్నాయని, సరెండర్ బిల్లులు చెల్లించడమే మర్చిపోయారని, జిల్లాలో నేటి వరకు కూడా జీతాలు చెల్లింపులు జరగలేదన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని అన్నారు.జిల్లా ఉపాధ్యక్షుడు మంగుజయప్రకాశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెగ్యులర్ ఎంఇఓలు, డిప్యూటీ ఈఓలు లేరని, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్ల పదోన్నతుల అవకాశం పునరుద్ధరణ చేయ లేదని విమర్శించారు. ఇక మోడల్ స్కూల్, కస్తూర్బా, సాంఘిక, గిరిజన, సంక్షేమ, మైనారిటీ, బీసీ గురుకుల పాఠశాలల్లో సమస్యలు నెలకొన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కూడా తక్షణమే నూతన విద్యా విధానం 2020ను ఉప సంహరణ చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి టి.శ్రీనాథ్, జిల్లా కోశాధికారి తాడూరి సుధాకర్, మండల అధ్యక్ష, కార్యదర్శులు గజ్జెల్లి రాజు, తాళ్లపల్లి నీలకంఠం, పిట్టల మహేందర్, అయిత కృష్ణమోహన్, యశ్వంత్, సీనియర్ నాయకులు మహ్మద్ దస్తగిరి పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధికి దాతల కృషి అభినందనీయం

**సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షుడు యాకాంతరావు**



**నవతెలంగాణ-పాలకుర్తి**

చదువుతోపాటు శారీరక, మానసిక ఉల్లాసానికి ఉపయోగపడే క్రీడల అభివృద్ధికి దాతల కృషి అభినందనీయమని సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వీరమనేని యాకాంతారావు అన్నారు. మండల కేంద్రంలో గల ఉన్నత పాఠశాలలో ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయుడు (ఫిజికల్ డైరెక్టర్) వివాసుదేవరావు, మహాత్మ హెల్పింగ్ హ్యాండ్ వ్యవస్థాపకులు గంట రవీందర్ సహకారంతో 25 వేల వ్యయంతో ఏర్పాటు చేసిన లాంగ్‌జంప్,హైజంప్ ఫిట్ (గుంత) నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పాయం శోభారాణితో కలిసి ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ,విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. దాతల సహకారంతో ఏర్పాటు చేస్తున్న క్రీడా అభివృద్ధిని విద్యార్థిని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇండియా కమిటీ చైర్మన్ జీడి సమ్మయ్య, పాఠశాల ఉపాధ్యాయులు ఓరుగంటి రమేష్, బలుగుల ఉప్పలయ్య, గుగులోతు బలరాంనాయక్, అన్నావజుల నరసింహమూర్తి, అశోక్, దీపతోపాటు ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ మహాసభల గోడ పత్రిక ఆవిష్కరణ

**నవతెలంగాణ-గార్ల**

ఈ నెల 13,14 తేదీలలో హైద రాబాదులో జరిగే టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయాలని యూటిఎఫ్ జిల్లా నాయకులు జి.భద్రు నాయక్ కోరారు. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరిగే టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర మహాసభల గోడపత్రికను సోమవారం స్థానిక నెహ్రూ సెంటర్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటిఎఫ్ రాష్ట్ర మహాసభలను జయప్రదం కోరారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాచర్ల సుందర్ కుమార్,ప్రధానకార్యదర్శి వి.భాస్కర్‌రావు,ఉపాధ్యక్షులు శివరాం ప్రసాద్, డి.స్వర్ణలత, మురళి కృష్ణ, సుబ్బారావు, పిజి హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రసాద్, స్వప్న, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## అదనపు కలెక్టర్ పై చర్య తీసుకోవాలి : సీపీఎం జిల్లా కార్యదర్శి ముకంకా రెడ్డి

**నవతెలంగాణ-జనగామ**

జిల్లాలోని జఫర్‌ఘడ్ సర్పంచ్ చేసిన అవినీతిపై ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వారి పట్ల దురుసుగా ప్రవర్తించిన అదనపు కలెక్టర్ పై చర్య తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ముకంకా రెడ్డి డిమాండ్ చేశారు.అందుకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ ఛాంబర్ పై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మోకాన్కుర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని మేజర్ గ్రామపంచాయతీ అయినా జాఫర్‌గడ్ గ్రామపంచాయతీ పరిధిలో రూపాయలు 25 లక్షలు అవినీతి జరిగిందని సిపిఎం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కి వచ్చామన్నారు. ఈ క్రమంలో గంటల తరబడి ఎదురు చూడడమే కాకుండా అదనపు కలెక్టర్ ఛాంబర్‌లోకి వెళ్ళిన తమ పట్ల అపాయింట్మెంట్ తీసుకున్నారా..? ఏ పార్టీ అయితే ఏంటి..? పోలీసులను పిలవండి అంటూ దురుసుగా మాట్లాడడం సరైనది కాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉన్న అదనపు కలెక్టర్ ప్రజల సమస్యలను విన్నవించుకునేందుకు వెళితే ఆ రకంగా ప్రవర్తించడం అప్రజాస్వామీకం అన్నారు. దురుసుగా ప్రవర్తించిన అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయి పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, బొట్ల శ్రీనివాస్, నాయకులు చందు నాయక్, చుంచు విజయేందర్ తదితరులు పాల్గొన్నారు.



## డివైఎఫ్ఐ నాయకుల ముందస్తు అరెస్టులు


**నవతెలంగాణ-గార్ల**




ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు న్యాయం చేయాలని డివైఎఫ్ఐ అధ్వర్యంలో ఛలో ప్రగతి భవన్ ముట్టడి కార్యక్రమానికి డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు ఇవ్వగా మండల కేంద్రానికి చెందిన డివైఎఫ్ఐ నాయకులు బాదం రాజేష్‌ను సోమవారం పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషనులో ఉంచారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ హై కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఎస్సై కానిస్టేబుల్ ప్రవేశ పరీక్షలో వచ్చిన ఏడు తప్పుడు ప్రశ్నలకు ఏడు మార్కులు కలపాలని, ఈవెంట్స్ సెలక్షన్‌లో ఎత్తు కొలిచేందుకు తీసుకువచ్చిన డిజిటల్ విధానాన్ని రద్దు చేసి మాన్యువల్ పద్ధతిలో కొనసాగించాలని, లాంగ్‌జంప్, రన్నింగ్ దూరాన్ని తగ్గించాలనే డిమాండ్‌తో అందోళన కార్యక్రమం చేపడుతున్న డివైఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. పోలీసులు అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, ఎస్సై, కానిస్టేబుల్ పరీక్షలకు సిద్ధం అవుతున్న అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## హరినాథరావు చిత్రపటానికి నివాళులు

**నవతెలంగాణ-లింగాలఘనపురం**



రాష్ట్ర ముఖ్యమంత్రి కేసిఆర్ వియ్యంకులు, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర పురపాలక, ఐటి, పరిశ్రమల శాఖా మాత్యులు కేటిఆర్ మామ పాకాల హరినాథరావు(74) ఇటీవల గుండెపోటుతో మరణించారు. సోమవారం పెద్దకర్మ సందర్భంగా హైదరాబాద్, జేఆర్‌సి కన్వెన్షన్ సెంటర్లో వారి చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్సీ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు యెగ్గె మల్లేశం కురుమ హరినాథరావు ఆత్మ శాంతించాలని భగవంతున్ని ప్రార్థించారు. వీరితో పాటు క్యామ మల్లేశం, సేవెళ్లి సంపత్ కుమార్, వస్పరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.







## సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-కాటారం

కాటారం మండల దామరకుంట సర్పంచ్ బాసాని రఘువీర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. బాధిత కుటుంబాన్ని సోమవారం మంథని ఎమ్మెల్యే దుదిల్ల శ్రీధర్ బాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే ఇటీవల అనారోగ్యంతో చనిపోయిన కుంభం రాకేష్ కుటుం బాన్ని పరమర్శించారు. సూరం తిరుపతికి ప్రమాదవశాత్తు కాలు విరగగా వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎంపీపీ పంతకాని సమ్మయ్య, జిల్లా అధ్యక్షులు ఐత ప్రకాష్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షుడు గద్దె సమ్మిరెడ్డి, రాజబాబు, సర్పంచ్ తేప్పల దేవేందర్ రెడ్డి, రమేష్ రెడ్డి, రాజబాపు, రామ్మోహన్, ఎన్ఎస్‌యుఐ జిల్లా వైస్ ప్రెసిడెంట్ జి శివ సాయి కృష్ణ, శంకర్ గౌడ్, లక్ష్మణ్ రెడ్డి, బాపు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉప సర్పంచ్ అంతిమ యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే

మండలంలోని చింతకాని మాజీ ఉపసర్పంచ్ ముక్కర స్వామి అంతిక్రియలలో మంథని ఎమ్మెల్యే దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వామి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కాంగ్రెస్ కమిటీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాష్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు సమ్మయ్య, మంథని డివిజన్ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి కదారి విక్రమ్, చింతకాని గ్రామ కమిటీ అధ్యక్షులు నిడిగొండ సత్యనారాయణ, మాజీ సింగిల్ విండో సొసైటీ చైర్మన్ దబ్బెట రాజేష్, సర్పంచ్ ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.



## ముగిసిన ఉద్యమ కారుని అంతిమయాత్ర

నవతెలంగాణ-గోవిందరావుపేట

తెలంగాణ మలిదశ పోరాట ఉద్యమ తార గజ్జి మల్లికార్జున్ అంతిమయాత్ర సోమవారం పస్రా గ్రామంలో వేలాది మంది అశ్రు నయనాల మధ్య ముగిసింది. ఆదివారం గుండెపోటుతో ఆకస్మిక మరణం చెందిన గజ్జి మల్లికార్జున్ పార్థివదేహాన్ని రాజకీయ పార్టీల నాయకులు సామాన్య ప్రజలు సందర్శించి కన్నీటి వీడ్కోలు పలికారు. బీఆర్ఎస్ నాయకులు కాకులమర్రి లక్ష్మణరావు మల్లికార్జున్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మల్లికార్జున్ కుటుంబానికి రూ.15000 ఆర్థిక సహాయాన్ని అందించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షులు సురపనేని సాయికుమార్, జెడ్పీటీసీ తుమ్మల హరిబాబు, ఎంపీపీ శ్రీనివాసరెడ్డి సంతాపం తెలిపారు. మల్లికార్జున్ కుటుం బాన్ని ఆర్థికంగా ఆదుకోవడమే కాకుండా డబుల్ బెడ్ రూమ్ ఇంటిని నిర్మించి ఇవ్వాలని సీపీఐ(ఎం) నాయకులు తీగల ఆదిరెడ్డి డిమాండ్ చేశారు. కాగా మంత్రి కేటీఆర్ ట్విట్టర్లో మల్లికార్జున కుటుంబాన్ని ఆదుకుంటామని స్పందిం చినట్లు ఆ పార్టీ నాయకులు తెలుపుతున్నారు. నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం పార్టీలో విరామం ఎరుగని నాయకునిగా మల్లికార్జునకు మంచి పేరు ప్రతిష్టలు ప్రజల్లో ఉన్నాయి. జిల్లాస్థాయి నాయకుడిగా ఆర్థికంగా మానసికంగా శారీర కంగా నష్టపోయినా పార్టీ కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తిగా మండల చరిత్రలో మల్లికార్జున్ నిలిచిపోయారు. కాగా మల్లికార్జున్ అంతిమయాత్ర ఘనంగా ముగిసింది.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-మొగుళ్ళపల్లి

ప్రమాదవశాత్తు కిందపడి తలకు దెబ్బ తగిలి ఎంజీఎంలో చికిత్స పొందు తూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని బంగ్లాపల్లి గ్రామం లో చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివ రాల ప్రకారం బంగ్లాపల్లి గ్రామానికి చెందిన కంకటి బాలమల్లు (60) సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 8న ఇంటి లోపల గోడలు ఎక్కి శుభ్రం చేస్తుండగా కాలు జారీ కిందపడి తలకు గాయమై స్పృహ కోల్పోయాడు. కూలి పనికి వెళ్లిన భార్య సాయంత్రం ఇంటికి వచ్చి చూసేంత వరకు బాలమల్లు అలాగే ఉండగా చికిత్స నిమిత్తం ఎంజీఎంకుకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య కంకటి ఓదెలమల్లు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.



## 'బాధిత గీత కార్మికుడిని ఆదుకోవాలి'

నవతెలంగాణ-చిట్యాల

వత్తిలో భాగంగా తాడిచెట్టు పై నుండి పడిన గీతా కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నేరెళ్ల ఓదెలు ప్రభుత్వాన్ని కోరారు సోమవారం ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ మండలం లోని నవాబుపేట గ్రామానికి చెందిన మాదారపు రవీందర్ గౌడ్ ఆదివారం రాత్రి తాటి చెట్టు ఎక్కుతున్న క్రమంలో జారి కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. గీత వృత్తినే నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నా రవీందర్ గౌడ్ తీవ్ర గాయాల పాలై ఉపాధి కోల్పోవడం జరిగిందని ప్రభుత్వం సంబంధిత ఎక్సైజ్ శాఖ, గీతా పారిశ్రామిక సంస్థ స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకుని ఆర్థిక సహాయం అందించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ ప్రధాన కార్యదర్శి పర్లపెల్లి కుమార్, జేరిపోతుల ఓదెలు, నేరెళ్ల రవి, ఐలయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

# వారం దాటినా... అందని 'రేషన్'

- కార్డుదారులకు తప్పని ఎదురుచూపులు
- సందిగ్ధంలో ప్రజాపంపిణీ...

నవతెలంగాణ-మల్హర్‌రావు

ప్రజాపంపిణీ వ్యవస్థపై సందిగ్ధం నెలకొంది. ప్రతినెలా ఒకటో తేది ప్రారంభం కావాల్సిన రేషన్ బియ్యం పంపిణీకి ఈనెల 8వ తేదీ వచ్చిన ఇంకా షురూ కాలేదు. ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారనే దానిపై కూడా సంబంధించిన అధికారుల్లో స్పష్టత లేదు. ఓవైపు సంక్రాంతి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో బియ్యం కోసం కార్డుదారులు నిరీక్షిస్తున్నారు. ఇప్పటికే బియ్యం షాపులకు చేరుకున్నా పంపిణీపై అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో డీలర్లు సైతం ఏమి చేయలేకపోతున్నారు. ప్రభుత్వ నిర్ణయం కోసం వారంతా ఎదురుచూస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం అవిర్భవించాక రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఫుడ్ సెక్యూరిటీ కార్డుదారులందరికి యూనిట్ కు 6కిలోలు చొప్పున బియ్యం అందజేస్తోంది. కరోనా తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో ఉపాధి లేక పేదలు తిండికి ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం 2020 ఏప్రిల్ నుంచి ఒక్కొక్క యూనిట్ కు 5కిలోల చొప్పున రేషన్ బియ్యం ఉచితంగా అందజేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం సైతం కేంద్రం నిర్ణయాన్ని సమర్థిస్తూ తమ వాటగా మరో 5కిలోల చొప్పున ఉచితంగా పంపిణీ చేస్తోంది. తాజాగా గత నెలలో సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఉచిత పంపిణీ బియ్యం మరో ఏడాది పాటు (డిసెంబర్ 2023 వరకు) పొడిగించాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్టాలకు ఉత్తర్వులు జారీ చేసింది.అయితే రాష్ట్ర ప్రభుత్వం తమ వాటగా అందించాల్సిన 5 కిలోల బియ్యంకు సంబంధించిన కేటాయింపులు చేయకపోవడం గమనార్హం.



మండలంలో కార్డులు ఇలా..

| | |
|---|---|
| మొత్తం కార్డులు | 8,906 |
| ఏఏఏఏ సి కార్డులు | 1.385 |
| ఏప్ ఎస్ సి కార్డులు | 7,521 |
| యూనిటు | 24,709 |
| రేషన్ దుకాణాలు | 19 |
| నెలసరి బియ్యం సరాపరా | 3,99,0,35 |

### స్పష్టత కరువు...!

కేంద్రము కేటాయించిన 5 కిలోల బియ్యంనే కార్డుదారులకు అందించాలని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం తొలుత పౌరసరపరాల శాఖను ఆదేశించింది. తదుగుణంగా జిల్లాల వారిగా కేటాయింపులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.ఈ మేరకు అధికారులు రేషన్ షాపులకు బియ్యం కేటాయింపులు చేశారు. ఆయా షాపు పరిధిలోని కార్డు దారులకు అవసరమైన బియ్యం సరపరా చేశారు.ఈ నెల 5 వ తేదీ నుంచి బియ్యం పంపిణీ ప్రారంభిస్తామని ప్రకటించారు. తీరా సాంకేతిక సమస్యల కారణంగా పేర్కొంటూ 7వ తేదీ నుంచి బియ్యం పంపిణీ చేస్తామని వెల్లడించారు. అయితే బియ్యం పంపిణీని చేపట్టవద్దంటూ ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందిన నేపథ్యంలో దాన్ని నిలిపి వేశారు.తిరిగి ఎప్పటి నుంచి ప్రారంభిస్తారో అనేదానిపై అధికారుల్లోనూ స్పష్టత లేదు.లేదంటే మునుపటిలానే రాష్టం వాటా కేటాయింపులు చేసి 10 కిలోలు యధావిధిగా ఇవ్వాలా.? అనేదానిపై ప్రభుత్వం యోచిస్తున్నట్లుగా తెలుస్తోంది. అందుకే ఈ నెల బియ్యం పంపిణీలో అలస్యమవుతుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైనా పండగ వేళ రేషన్ బియ్యం పంపిణీలో జరుగుతున్న జాప్యంతో కార్డులుదారులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

- మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

నవతెలంగాణ-మల్హర్‌రావు

స్థానిక సంస్థలను తెలంగాణ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీదర్ బాబు అన్నారు. మండలంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేయడానికి ప్రతి ఒక్కరికి హక్కు ఉందని గుర్తు చేశారు. రాష్ట్రంలో సర్పంచులు ధర్నాకు వెళ్తుంటే ఎక్కడికక్కడ అరెస్టు చేస్తున్న తీరును ఖండిస్తున్నామన్నారు. సర్పంచ్ కున్న అధికారాలను తీసేసి అధికారుల చేతిలో ప్రభుత్వం పెట్టిందన్నారు. స్థానిక సంస్థలకు సంబంధించి పంచాయతీ రాజ్ గ్రామపంచాయతీలకు, మండల పరిషత్ మున్సిపల్ జిల్లా పరిషత్‌లకు నిధులు కేటాయించకుండా ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టకుండా ఎన్నడూ లేని విధంగా నిర్బంధం చేస్తోందన్నారు.



హైకోర్టు తీర్పు వల్ల ఇంద్ర పార్క్ వద్ద ధర్నా చేసే అవకాశం కలిగిందన్నారు. కొత్త పంచాయతీ రాజ్ జీవో ద్వారా వారి హక్కులకు భంగం కలిగిస్తూ కాంగ్రెస్ పార్టీ పక్షాన వారి సమస్యలపై ధర్నా చేస్తామని, ప్రభుత్వం నిరాకరిస్తే హైకోర్టుకు వెళ్లడం జరిగిందన్నారు. నాలుగు నెలల నుండి గ్రామ పంచాయతీలకు 1250 కోట్లు రాష్ట్ర ఫైనాన్స్ నుంచి రావాల్సి ఉందని, 15వ ఫైనాన్స్ కమిషన్ నుండి రూ.35000 కోట్ల గ్రామ పంచాయితీలకు వచ్చే వాటిని రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టించిందన్నారు. గ్రామాలలో నాలుగు నెలల నుండి అభివద్ధి పనులు చేస్తామంటే చిల్లి గవ్వ లేకుండా పోయిందని విమర్శించారు. కొత్త పంచాయతీ రాజ్ జీవోను తీసుకోవచ్చి గ్రామపంచాయతీలకు నిధులు ఇవ్వకుండా కేసీఆర్ ప్రతినెల ప్రతి గ్రామ పంచాయతీకి జనాభా ప్రకారం నిధులు పంపిస్తున్నామని చెప్పి, ఆ నిధులను డిపిఓ ఆఫీస్ ద్వారా సర్క్యులర్ జారీ చేసి ఎలక్ట్రిసిటీ, మొండి బకాయిల కింద ప్రభుత్వం నిధులను జప్తు చేసుకుందన్నారు. సర్పంచులను భయాందోళనలకు గురి చేస్తూ స్మశాన వాటికలు, డంప్ యార్డులు తదితర టార్గెట్లను పెట్టి పని పూర్తి చేయకుంటే సస్పెన్షన్ చేస్తామని భయభ్రాంతులకు గురి చేయడం సరికాదన్నారు. ప్రకతి వనాలు ఇతర పనులకు నిధులు రాకుండా సర్పంచ్ లు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. స్థానిక సంస్థలకు రావలసిన డిఎంఎఫ్టి నిధులు, పెద్దపెల్లి భూపాలపల్లి జిల్లాకు వచ్చే సహజ వనరుల నిధులు ఈ ప్రాంతంలోనే జిల్లా పరిషత్, మండల పరిషత్ ,గ్రామ పంచాయతీలకు ఖర్చు చేయాలన్నారు.



## మంత్రి కేటీఆర్‌ను కలిసిన జిల్లా ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర పురపాలక శాఖా మాత్యులు కేటీఆర్ మామ పాకాల హరినాధరావు ఇటీవలె మృతిచెందిన నేపథ్యంలో సోమవారం హైద్రాబాద్‌లో హరినాధరావు దశదినకర్మకు మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లతోపాటు జిల్లాకు చెందిన ఎంపి మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, బస్వరాజ్ సారయ్య, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, హరిప్రియానాయక్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, వరంగల్ రూరల్ జడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి, మాజీ ఎంపి సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు, నాగుర్ల వెంకటేశ్వర్లు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రిని, వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. పాకాల హరినాధరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

## అధికారుల ప్రోటోకాల్ పాటించకపోవడం బాధాకరం

సర్పంచ్ పులిగంటి మమత నర్సయ్య

నవతెలంగాణ-మల్హర్‌రావు

అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడం చాలా బాధకమని మండలంలోని చిన్నతూ%శీ%ఢ్ల సర్పంచ్ పులిగంటి మమత నర్సయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రములో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇటీవల భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమం సమీక్ష సమావేశంలో స్థానిక జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీ హర్షిని విషయంలో ఉన్నత అధికారులు ప్రోటోకాల్ మర్చి వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. దళిత మహిళ ఉన్నత విద్యావంతురాలు అయిన జక్కు శ్రీహర్షిని విషయంలో పలుమార్లు అధికారులు ప్రోటోకాల్ పాటించకుండా అవమానపర్చడం సరికాదన్నారు. దళిత మహిళ అయినందుకే ఉన్నత అధికారులు ఇష్టానురీతిలో వ్యవహరించారని ఆరోపించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం అయితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.



## నూతన మెడికల్ ఆఫీసర్‌కు వైద్య సిబ్బంది సన్మానం

నవతెలంగాణ -తాడ్వాయి

మండలంలోని కాటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కి నూతనంగా వచ్చిన డాక్టర్ రంజిత్ ను కాటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, కేక్ కట్ చేసి, శాలువా కప్పి, బొకేతో ఘనంగా సన్మానించారు.

ఈ సందర్భంగా నూతన వైద్యాధికారి రంజిత్ మాట్లాడుతూ కాటాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల గ్రామాల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందిస్తానని తెలిపారు. పీహెచ్సీ పరిధిలోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు సరైన టైంలో పౌష్టికాహారం, తీసుకొని వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ ఈ ఓ బల్గూరి సమ్మయ్య, ఏఎన్ఎంలు చంద్రకళ గంగా నవలోక హెల్త్ అసిస్టెంట్స్ మేడ అనిల్, మొగిలిపల్లి ముత్తయ్య, ఫార్మాసిస్ట్ శివరంజని, ఆశా కవిత తదితరులు పాల్గొన్నారు.



## ఈనెల 13న ముగ్గుల పోటీలు

నవతెలంగాణ - ములుగు

తెలంగాణ జాగతి సంక్రాంతి సంబరాలలలో భాగంగా ఈ నెల 13 న శుక్రవారం ఉదయం 7గంటలకు ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాల అవరణలో ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్లు తెలంగాణ జాగతి ములుగు జిల్లా అధ్యక్షులు డాక్టర్ పోరిక రవీందర్ సోమవారం తెలిపారు. పోటీలలో పాల్గొని గెలిచిన వారికి మొదటి బహుమతి రూ.5000, రెండవ బహుమతి రూ.3000, మూడవ బహుమతి రూ.2000 అందిస్తామన్నారు. ఎవరి ముగ్గుల సామాగ్రి వారే తెచ్చుకోవాలని ములుగు జిల్లా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇతర వివరాలకు 9550317587, 9393110023 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

# అదనపు తప్పి చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు


- పలువురు ప్రయాణికులకు గాయలు.
- క్షతగాత్రులను పరామర్శించిన.. ఎమ్మెల్యే శ్రీధర్ బాబు

నవతెలంగాణ-మల్హర్‌రావు

మంథని, కాటారం ప్రధాన రహదారి సోమన్ పల్లి వద్ద మండల కేంద్రమైన తాడిచెర్ల-మంథని నడుస్తున్న మంథని డిపో ఆర్టీసీ బస్సు స్టీరింగ్ విరిగడంతో అదుపుతప్పి ఓ చెట్టును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఉన్న పలువురు ప్రయాణికులకు స్వల్ప,



మరికొందరికి తీవ్రమైన గాయాలైయ్యాయి. హుటాహుటిన జాతీయ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీదర్ బాబు సంఘటన స్థలానికి చేరుకొని క్షత గాత్రులను పరామర్శించారు. తీవ్ర గాయాలైన పలువురిని అంబులెన్స్ లలో మంథని ప్రభుత్వ ఆసుపత్రికి పంపించే ఏర్పాటు చేశారు. ఎవరు అధైర్య పడవద్దని సూచించారు.ఆసుపత్రిలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.మిగతా ప్రయాణికుల కోసం మంథని డిపో మేనేజర్ తో మాట్లాడి మరో బస్సు తెప్పించి సురక్షితంగా గమ్యం చేరేలా చేసి మానవత్వం చాటుకున్నారు.



## ఉచిత శిక్షణా ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఐటీ మాస్టర్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రొప్రైటర్ వేముల శంకర్

నవతెలంగాణ-భూపాలపల్లి

ఉచిత శిక్షణ తో ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐటీ మాస్టర్స్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ప్రోపరేటర్ వేముల శంకర్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ... జయ శంకర్ జిల్లాలో 18-35 సం?ల వయస్సు గల షెడ్యూల్డు కులాల నిరుద్యోగ యువతకు గొప్ప సువర్ణ అవకాశం కల్పించినట్లు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్డు కులాల సహకార అభివద్ధి లిమిటెడ్ సంస్థ , మిరకిల్ వాలంటరీ ఆర్గనైజేషన్ సంయుక్తంగా ఉచిత శిక్షణా ఇచ్చి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం వసతి సౌకర్యం,ఉచిత శిక్షణా అనంతరం ఉపాధి/ ఉద్యోగ అవకాశంతోపాటు కోర్సు అనంతరం సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు ఏదైన డిగ్రీ పాస్ కోర్సు చదివి ఉండాలని, శిక్షణ 75 రోజులు ఉంటుందని అన్నారు. ధరకాస్తు కోసం ఏదైన డిగ్రీ పాస్ సర్టిఫికేట్, క్యాస్ట్ సర్టిఫికేట్, ఆధార్ కార్డ్, 4 ఫోటోలు, ట్రాన్సుర్ సర్టిఫికేట్ టీసీ ఉండాలన్నారు. పూర్తి వివరాల కోసం ఐటీ మాస్టర్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ 9542736524, 9542636524 నెంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.



## కరోనా సెకండ్ డోస్, బూస్టర్ తప్పనిసరి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అల్లెం అప్పయ్య

నవతెలంగాణ - ములుగు

కోవిడ్ వ్యాధి నుండి రక్షించుకోవాలని దానీ కోసం కోవిడ్ వాక్సిన్ ను అశ్రద్ధ చేయకుండా ప్రతి ఒక్కరూ సెకండ్ డోస్, బూస్టర్ డోస్ మొదలగు కోవాక్సిన్ వ్యాక్సిన్ కు సంబంధించిన డోసులు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అల్లెం అప్పయ్య జిల్లా ప్రజలను సోమవార కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం నుండి ఈ క్రింద పేర్కొనబడిన సెంటర్లలో కోవిడ్ వ్యాక్సిన్ కో వాక్సిన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఒకటి జిల్లా ఆసుపత్రి ములుగు, రెండు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏటూరు నాగారం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రాయినిగూడెం, వెంకటాపూర్ ములుగు, తాడువాయి, మంగపేట యందు కోవాక్సిన్ వ్యాక్సిన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.



## అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలి

- సీడీపీఓ మల్లీశ్వరి

నవతెలంగాణ -తాడ్వాయి

మండలంలోని కాటాపూర్-4, కౌశెట్టివాయి అంగన్వాడి సెంటర్ల ను సోమవారం సీడీపీఓ మల్లీశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాటా పూర్-4 అంగన్వాడి సెంటర్ టీచర్ శ్రీకళ రికార్డులను సరిగా రాయడం లేదని, రెండు రోజులలో రికార్డులు పూర్తి చేయాలని తెలిపారు. లేకపోతే 'మేమో' జారీ చేసి తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌశెట్టివాయి స్థానిక సర్పంచ్ వట్టం సావిత్రి తో కలిసి కౌశెట్టివాయి అంగన్వాడి సెంటర్ ను పరిశీలించారు. పరిసరాలు బాగా లేవని, రికార్డు మెంటేన్స్ కూడా సరిగా లేదని మండిపడ్డారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అంగన్వాడీ ఆయా కు సూచించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మల్లీశ్వరి మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు సమయపాలన పాటించడం లేదని తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికైనా టీచర్లు సమయపాలన పాటించాలని, పిల్లలకు పోషక ఆహారం అందించాలని సూచించారు. ఆమె వెంట సూపర్వైజర్ శారద ఉన్నారు.

## 'మొండి బకాయిల కింద ఆపొద్దు'

నవతెలంగాణ -మహాముత్తారం

ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు మంజూరు అయిన డబ్బులను మొండి బకాయిల కింద బ్యాంకర్లు ఆపవద్దు ఎమ్మెల్యే శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం మంథని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి మాజీ మంత్రి వర్యులు మంథని ఎమ్మెల్యే శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ . రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గైడ్లైన్స్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నుండి ఆసరా పెన్షన్, రైతుబంధు, వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలో పడుతున్న డబ్బును బ్యాంకు అధికారులు మొండిబకాయి కింద ఆపి ఖాతాదారులను ఇబ్బంది పెడితే ఆర్బిఐకి ఫిర్యాదు చేస్తామని అన్నారు.

## 13 వరకు అడ్మిషన్లు...

నవతెలంగాణ-మహదేవపూర్

ఈనెల 13 వరకు ఓపెన్ స్కూల్ ఎస్ఎస్సి, ఇంటర్మీడియట్ ప్రత్యేక అడ్మిషన్స్ జరగనున్నాయని, ఆసక్తి ఉన్నవారు జడ్పీహెచ్ఎస్ బాయ్స్ 9492202095, 8247318662లో సంప్రదించాలని ఓపెన్ స్కూల్ సహ కో ఆర్డినేటర్ బి.ప్రభాకర్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. ఒరిజినల్ టీసీగానీ,స్టడీ సర్టిఫికెట్, బర్త్‌డే సర్టిఫికేటు జిరాక్స్, కులధ్రువీకరణ పత్రం ఒరిజినల్ , ఆధార్ జిరాక్స్, రెండు రేషన్ కార్డు జిరాక్స్, మూడు పాస్ పోర్ట్ సైటజ్ ఫొటోస్‌తో సంప్రదించాలన్నారు. ఒకే సంవత్సరంలో ఇంటర్ పూర్తి చేసే అవకాశం కోసం ఒరిజనల్ ఎస్ఎస్సి మెమో, కులధ్రువీకరణపత్రం ఒరిజినల్ ఆధార్ జిరాక్స్, 3 పాస్ పోర్ట్ ఫొటోలతో సంప్రదించాలన్నారు.

# మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు

## లాఠీలు మరిచిన ఎక్సైజ్ పోలీసుల - ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు

**నవతెలంగాణ-ఆత్మకూర్**

బెల్ట్ షాపులను మూయించి మహిళలకు రక్షణ కల్పించవలసిన ఎక్సైజ్ పోలీసులే మామూళ్ల పుచ్చుకొని.. లాఠీలు మరచిన సంఘటన అక్కంపేటలో చోటుచేసు కుంది. సోమవారం పలుగ్రామాల మహిళలు, ప్రజలు బెల్ట్ షాపులను మూయించాలని పరకాల ఎక్సైజ్ పోలీసులుకు ఫిర్యాదు చేసారు. ఆగమేఘాల పై బెల్ట్ షాపులను ముమ్మర తనిఖీలు నిర్వహించి వారి వద్దనుండి విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని..మేము చెప్పినట్టు వింటే మీకు మావంతు సహకారం ఎప్పటికి ఉంటుందని దర్జాగా బెల్ట్ షాపులు నిర్వహించు కోవచ్చని భరోసా ఇచ్చారు.బెల్ట్ షాపు ల నిర్వాహకులు ఎక్సైజ్ పోలీసుల అండ ఉంటె అధిక ధరలకు సొమ్ము చే సుకోవచ్చనే ఎక్సైజ్ పోలీసులు అడిగిన మామూళ్లను ఇచ్చేందుకు అం గీకారం తెలుపడంతో పాటు మొదటి విడత మాములు అందచేశారు. అవి అందుకున్న ఎక్సైజ్ పోలీసులు ఆనందంలో తీసుకువచ్చిన లాఠీలను సైతం అక్కడే వదిలి వెళ్లిపోయారు. లాఠీలను చుసిన మందు బాబులు బెల్ట్ షాపులకు రాకుండా దూరం నుంచే జారుకోవడం చూస్తున్న విక్రయదారులు ఎందుకు పోతున్నారో తెలియక మందు బాబులను అడగగా లాఠీలను చూసి పొలిసులు ఉన్నారని అనడంతో అవాక్కయ్యారు. మీకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే వారికీ మామూళ్లు ఇచ్చామని ఆనందంలో లాఠీలను మరిచి పోయారని విక్రయ దారులు మందు బాబులకు తెలిపారు.దర్జాగా మందు సేవించవచ్చు ఎక్సైజ్ పోలీసులంతా మనవాళ్లే కావడంతో ఎలాంటి ఇబ్బందులు ఉండవ్ లాఠీలు మరిచిపోయిన విషయం తెలుసుకున్న గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. మామూళ్లు ఇస్తే ఏదైనా వదిలి పోతారని ప్రశిస్తున్నారు.

**బెల్ట్ షాపులనుండి మామూళ్ల వసూళ్లు ...**

అక్కంపేట గ్రామంలో విక్రయిస్తున్న బెల్ట్ షాపుల యజమానులనుంచి నెల నెల మామూళ్లతో పాటు అదనంగా జిరాక్స్ సెంటర్లో బకాయి ఉన్న బిల్లులు,ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ కు సంబంధించిన బిల్లులను వారి వద్ద నుండి బలవంతగా వసూళ్లు చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల నెల మామూళ్లు ఇవ్వడంతో పాటు అదనంగా ఈ బిల్లులు చెల్లిచడంతో శ్రమ మాది దోపిడీ ఎక్సైజ్ పోలీసులదని పాలు గ్రామాల బెల్ట్ షాపుల నిర్వాహకులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.



# సమస్యల వలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల

## మరుగుదొడ్లు లేక విద్యార్థులకు ఇబ్బందులు - ఆర్వో ప్లాంట్ ఉన్న నిరుపయోగమే - శిథిలావస్థలో తరగతి గదులు







**నవతెలంగాణ-తొర్రూరు**

డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరైన వసతులు లేక విద్యార్థులు, అధ్యాపకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కళాశాలలో మొదటి సంవత్సరంలో 131 మంది, ద్వితీయ సంవత్సరంలో 176 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. రెండున్నర ఎకరాల స్థలంలో నిర్మించిన కళాశాల భవనం, మరుగుదొడ్లు మినహాయించి ఎలాంటి కనీస మౌలిక వసతులు కల్పించలేదు. ప్రభుత్వ కళాశాలపై ప్రభుత్వం చిన్న చూపు చూస్తుండడంతో తల్లిదండ్రులు తమ స్తోమతకు మించి ప్రైవేటు కళాశాలలో తమ పిల్లలను చదివిస్తున్నామని పలువురు పేర్కొంటున్నారు. ఉన్నతమైన బోధన సిబ్బంది కలిగి ఉన్న తొర్రూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి పనులు చేపడితే విద్యార్థుల సంఖ్య మరింత గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

**కనీస సౌకర్యాలు కరువు...**

కళాశాలలో 11 తరగతి గదులు ఉన్నాయి. వీటిలో 6 గదులు శిథిలావస్థలో ఉన్నాయి. మూడు గదుల్లో లాబ్‌లు, ప్రిన్సిపల్ గది ఉన్నాయి. తరగతి గదిలో వర్షం వస్తే కురుస్తున్నా యి. శిథిలావస్థలో ఉన్న ఆరు గదుల్లో విద్యార్థులు కూర్చునే పరిస్థితి లేదు. కిటికీలు, తలు పులు పగిలి ఉన్నాయి. స్లాబులు కురుస్తున్నాయి. గోడలు చిలికలు భారీ ఉన్నాయి. బాలురకు ఒకటి, బాలికలకు రెండు, స్టాఫ్‌కు ఒకటి టాయిలెట్స్ ఉన్నా నీటి వసతి లేదు. మిషన్ భగీరథ నల్ల మీదనే ఆధారం. సరిపడ నీటి వసతి లేకపోవడం వలన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా తరగతి గదులు, ప్రయోగశాలలు, విద్యార్థులు కూర్చునేందుకు డ్యూయల్ డెస్క్ లు, ఫర్నిచర్ ఏర్పాటు చేయలేదు. శుద్ధమైన తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంటు నిరుపయోగంగా ఉంది. విద్యార్థుల సంఖ్యను పెంచాలనే ఉద్దే శంతో ప్రిన్సిపాల్ గజ్జల రమేష్‌తోపాటు కళాశాల సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని నెలనెల తమ సొంతంగా కొంత వ్యయాన్ని వెచ్చిస్తు న్నారు. 2017-



16లో అప్పటి విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి ఉచిత విద్య-ఉచిత భోజనం పథకం ప్రారంభించినా ఆది అమలుకు నోచుకోలేదు. గత ఆరు సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం వార్షిక పరీక్షలకు రెండు నెలలు ముందు ఎర్రబెల్లి దయాకర్‌రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ట్రస్ట్ చైర్ పర్సన్ శ్రీమతి ఉషా దయాకర్ రావులు విద్యార్థులకు ఉచిత భోజనం అందిస్తున్నారు. ఇదిలా ఉండగా 2020-21 సంవత్సరంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేస్తామని హామీ ఇచ్చారు.ఆహామీ నేటికీ అమలు కావడంలేదు.ఈ కళాశాలలో గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎక్కువగా ఉన్నారు. మధ్యాహ్న భోజనం అందిస్తే స్టడీ అవర్స్ పెరిగి ఉత్తీర్ణతా శాతం పెరుగుతుంది. కళాశాలలో గత సంవత్సరం వరకు డిగ్రీ కళాశాలతో కలిసి ఉండేది. సంవత్సరం క్రితం డిగ్రీ కళాశాల సొంత భవనంలోకి మారింది. జూనియర్ కళాశాల పై ఆరు రేకుల షెడ్డులను నిర్మించారు. కానీ వీటికి తలుపులు, కిటికీలు, ఫ్యాన్లు, బ్లాక్ బోర్డు, ఫర్నిచర్ లాంటి ఏ వసతులు లేవు. ప్రస్తుతం ఇవి నిరుపయోగంగా ఉన్నాయి.

### ప్రత్యేక నిధులు కేటాయించాలి గజ్జల రమేష్, ప్రిన్సిపల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల తొర్రూరు

కళాశాలలో ప్రధానంగా తాగునీరు, తరగతి గదుల ఆవశ్యకత ఉంది. కళాశాలలో నెలకొన్న సమస్యలపై విద్యా శాఖ ఉన్నతాధికారులకు నివేదిక అందించాము. గత సంవత్సరంతో పోలిస్తే 50 మంది విద్యార్థులు తగ్గారు. ఉన్నంతలో ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యాబోధన చేస్తున్నాము. వాటర్ ప్లాంట్ పని చేయడం లేదు. గత సంవత్సరం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో రాష్ట్రస్థాయిలో విద్యార్థులు ర్యాంకులు సాధించారు. 2014-15 నుండి కళాశాలలో అడ్మిషన్ ఫీజును ప్రభుత్వం రద్దు చేసింది.



### తరగతి గదులు నిర్మించాలి : బానోతు మౌనిక, విద్యార్థిని, ఇంటర్ మొదటి సంవత్సరం

కళాశాలలో స్థలం ఉన్నప్పటికీ తరగతి గదుల నిర్మాణం లేదు. ఎప్పుడో నిర్మించిన గదులు ఆరు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ గదుల్లో కూర్చునే పరిస్థితి లేదు. తాగునీటి వసతి కల్పించాలి. ఫర్నిచర్, లాబ్ సౌకర్యం మెరుగుపరచాలి.



### మధ్యాహ్న భోజనం అమలు చేయాలి గుగులోతు అస్మిత, ఇంటర్ ద్వితీయ సంవత్సరం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంతా పేద విద్యార్థులే ఉన్నారు. ఉదయం వచ్చి సాయంత్రం వరకు ఉండాల్సి వస్తుంది. ప్రత్యేక తరగతుల నిర్వహణ సమయంలో మరో రెండు గంటలు అదనంగా ఉండాల్సి వస్తుంది. ఆకలితో చదువుకోలేక పోతున్నాం. దూర ప్రాంతాల నుండి వస్తున్నాం. మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.



# ఇంటి స్థలం కోసం నిరసన



**నవతెలంగాణ-కాజీపేట**

వారసత్వంగా వచ్చిన ఇంటి స్థలాన్ని పెదనాన్న, బాబాయ్ ఇద్దరు కలిసి ఆక్రమించి ఇంటి నిర్మాణం చేస్తున్నారని ఆరోపిస్తూ ఇద్దరు మానసిక వికలాంగులైన తమ్ముళ్ళతో కలిసి వారి అక్క నిరసనకు దిగిన ఘటన హనుమకొండ జిల్లా కాజీపేట బాపూజీనగర్‌లో చోటుచేసుకుంది. మానసిక వికలాంగుల అక్క సిందూ తెలిపిన వివరాలప్రకారం తమ తాతకు ఉన్న ముగ్గురు కుమారులలో తమతండ్రి రెండవ సంతానమని తమకు ఉన్న 500 గజాల ఇంటి స్థలంలో ముగ్గురు కుమారులకు సమానంగా పంచివ్వగా, తమ తండ్రికి 166 గజాల స్థలం వచ్చిందన్నారు. రైల్వే ఉద్యోగి అయిన తమ తండ్రి స్థలంలోనే రేకుల ఇంటిని నిర్మించుకొని ఉండేవారమన్నారు. 2002లో తమ తండ్రి ఆక్సిడెంట్‌లో చనిపోగా 2004లో తండ్రి ఉద్యోగం తల్లికి రావడంతో కాజీపేట రైల్వే క్వార్టర్స్ లోకి నివాసాన్ని మార్చినట్లు తెలిపారు. 2016లో తన వివాహం జరగడంతో అప్పటి నుండి మంచిర్యాల జిల్లాలోని భర్తవద్దే ఉంటున్నట్లు తెలిపింది. కాజీపేటలో తల్లి ఒక్కతే ఉండడం, ఉన్న ఇద్దరు తమ్ముళ్ళ మానసిక వికలాంగులు కావడంతో ఇదే అదునుగా భావించిన తమ బాబాయ్, పెదనాన్న ఇద్దరు తమ ఇంటి స్థలంపై కన్నేసి తల్లిపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. కొద్ది రోజుల క్రితం తమ స్థలాన్ని వేరే ఒకరి వద్దనుంచి కొనుగోలు చేసినట్లు నఖిల రిజిస్ట్రేషన్ చేసుకొని ఇంటి నిర్మాణ పనులు చేపట్టారన్నారు. నిర్మాణాన్ని ఆపమని జనవరి 2న జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. మున్సిపల్ ఉద్యోగి ఇంటి నిర్మాణం వద్దకు వచ్చి పనులు ఆపాలని చెప్పి వెళ్లినప్పటికీ పనులు ఆగలేదన్నారు. జిల్లా అధికారులు స్పందించి తమకు న్యాయం చేకూర్చాలని ఇంటి నిర్మాణం ముందు వికలాంగుల తమ్ముళ్లతో కలిసి టెంట్ వేసుకొని నిరసనకు దిగినట్లు తెలిపరు..

### నంబర్ ప్లేట్ లేని వాహనాలు నడిపిన

# ఇద్దరిపై కేసు నమోదు

### కారు, బైక్ వాహనాలు స్వాధీనం

**నవతెలంగాణ-ఆత్మకూర్**

ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా, సోమవారం రాత్రి నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరు వ్యక్తులపై ఛీటింగ్ కేసు నమోదు చేసినట్లు సిఐ గణేశ్ కుమార్ తెలిపారు. వరంగల్ జిల్లా వర్ధనపేట మండలం చెన్నారం గ్రామానికి చెందిన పెండ్యాల అక్షయ్ ద్విచక్ర ప్రయాణిస్తుండగా పట్టుకున్నామన్నారు. హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల గ్రామానికి చెందిన వన్నెపు రాజు కారులో ప్రయాణిస్తుండగా పట్టుకొని నంబర్ ప్లేట్ లేకపోవడంతో పాటు, సరియైన పత్రాలు లేకపోవడంతో ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు చేశామన్నారు. రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.